# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - మంగళవారం 15 ఏప్రిల్ 2025 | సంపుటి:9 | సంచిక:109 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |


## హర్రాస్‌కు గోల్కొండ బ్లూ డైమండ్



రూ. 430 కోట్ల ధర పలకొచ్చని అంచనా

2

## రానున్న మూడు రోజులు వర్షాలు



2

## అంబేద్కర్ విగ్రహానికి స్లాబ్ నిర్మాణ పనుల్లో మంత్రి నిమ్మల శ్రమదానం



**అమరావతి:** అంబేద్కర్ విగ్రహానికి స్లాబ్ నిర్మాణ పనుల్లో మంత్రి నిమ్మల రామానాయుడు శ్రమదానం చేశారు. కూలీలతో కలిసి ఇనుప కడ్డీలు మోశారు. వెల్డింగ్ పని చేశారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం చింతపర్రులోని అరుంధతిపేటలో ఆయన శ్రమదానం చేశారు. అంబేద్కర్ విగ్రహానికి రక్షణగా స్లాబ్‌ను నిర్మించేందుకు నిధులిచ్చినట్లు మంత్రి తెలిపారు. నియోజకవర్గంలోని అంబేద్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలన్నింటికీ స్లాబ్ నిర్మాణాలను దశల వారీగా పూర్తి చేస్తామన్నారు.



# అంబేద్కర్ విదేశీ విద్యా దీవెనను మళ్లీ ప్రారంభిస్తాం

**పొన్నెకల్లు:** అంబేద్కర్ విదేశీ విద్యా దీవెనను మళ్లీ ప్రారంభిస్తామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. గుంటూరు జిల్లా తాడికొండ మండలం పొన్నెకల్లులో ఆయన పర్యటించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా వేడుకల్లో పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. "కుల వివక్షకు వ్యతిరేకంగా అంబేద్కర్ పోరాడారు. రాజ్యాంగంలో హక్కులను అంబేద్కర్ పొందుపరిచారు. దళితులకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుంది. ఎస్సీ వర్గానికి చెందిన వ్యక్తిని లోక్‌సభ స్పీకర్‌గా చేసిన పార్టీ తెదేపా. దళితుల హక్కులు కాపాడాలని ఆదేశాలు ఇచ్చాం. సొంతూరిలోనే బంగారు భవిష్యత్తు ఉందని యువత ప్రస్తుతం భావిస్తున్నారు. పేదలకు అండగా ఉంటానని

...మిగతా 2లో

## మరోసారి క్యాబినెట్ భేటీ

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంత్రి మండలి మరోసారి సమావేశం కానుంది. మంగళవారం ఉదయం 11 గంటలకు సచివాలయంలో ఏపీ క్యాబినెట్ భేటీ కానుంది. ఈ సమావేశంలో మంత్రులు పలు కీలక అంశాలపై చర్చించి ఆమోదం తెలపనున్నారు. రాజధాని అమరావతి సహా ఏపీ అభివద్ధికి సీఎం చంద్రబాబు కంకణం కట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు రేపు జరిగే సమావేశంలో రాజధాని, సీఆర్డీయే, నూతన అసెంబ్లీ, హైకోర్ట్ భవనాల నిర్మాణం

...మిగతా 2లో

## కుమారుడి పేరుపై లెజినోవా భారీ విరాళం



**తిరుమతి:** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా లెజినోవా తిరుమలలో భారీ విరాళాన్ని అందజేశారు. నిత్యాన్నదానికి తిరుమల అధికారులకు రూ.17 లక్షల విరాళం అందజేశారు అన్నా కొణిదెల. అన్నదానంలో మధ్యాహ్నం భోజనానికి

...మిగతా 2లో

## అందాల జలపాతం.. ఆదమరిస్తే ప్రమాదం

**అనంతగిరి:** మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన జీనబాడు పంచాయతీ సరియా జలపాతానికి దూర ప్రాంతాల నుంచి కూడా పర్యాటకులు వస్తుంటారు. అయితే ఈ జలపాతంపై అవగాహన లేక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. గత పదేళ్లలో 40 మందికి పైగా ఇక్కడ మతి చెందారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పోలీసులు అవగాహన కల్పిస్తున్నా కొందరు పట్టించుకోకుండా ఈతకు దిగడం, సెల్ఫీల మోజులో పడి పరిసరాలను గమనించకపోవడంతో మత్యువాత పడుతున్నారు. అనంతగిరి మండలంలోని సరియా జలపాతం 2015లో బాహ్యప్రపంచానికి పరిచయమైంది. ఇది అనతికాలంలోనే పర్యాటక ప్రాంతంగా పేరొందింది. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన పర్యాటకులు సరియా జలపాతాన్ని తిలకించేందుకు భారీగా తరలి వస్తుంటారు.

...మిగతా 2లో

### కృష్ణలంక భూముల్లో స్పోర్ట్స్ సిటీ..

## సాధ్యాసాధ్యాలపై కమిటీ ఏర్పాటు

**అమరావతి:** ఎన్టీఆర్ జిల్లాలో కృష్ణ నదీ తీరాన స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు దిశగా ఏపీ ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. ఇబ్రహీంపట్నంను ఆనుకుని ఉన్న కష్ణలంక భూములను మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు వసంత కష్ణ ప్రసాద్, బోండా ఉమా, జిల్లా కలెక్టర్ లక్షిషా, ఇతర అధికారులు సోమవారం పరిశీలించారు. కృష్ణ నదిలో ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల పరిధిలోని పెదలంక, చినలంకలో ఉన్న లంకభూములను పరిశీలించారు. మూడు కిలోమీటర్ల మేర ఉన్న లంక భూముల్లో మంత్రి, ఎమ్మెల్యేలు కాలినడకన తిరిగి పరిశీలించారు.

ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ..



"అమరావతి రాజధాని నిర్మాణ పనులు ఊపందుకుంటున్నాయి. ఇప్పటికే 3 వేల మంది కార్మికులు, 500 మెషీన్లు పనులు చేస్తున్నాయి. ఏప్రిల్ నెలాఖరుకు సుమారు 15 వేల మంది కార్మికులు రోజువారీ పనుల్లో పాల్గొంటారు. మూడేళ్లలో

...మిగతా 2లో

## కసిరెడ్డి ఇంట్లో సిట్ సోదాలు

**హైదరాబాద్:** వైకాపా హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. మద్యం కుంభకోణంలో నాటి ప్రభుత్వ పెద్దల తరఫున అన్నీ తానై వ్యవహరించారనే అభియోగాలు ఎదుర్కొంటున్న కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి (రాజ్ కసిరెడ్డి)కి చెందిన ఇళ్లు, కార్యాలయాల్లో సిట్ బందం సోదాలు చేస్తోంది. హైదరాబాద్‌లోని మూడు ప్రాంతాల్లో మొత్తం 50 మంది సిట్ అధికారులు తనిఖీలు చేస్తున్నారు.



కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డికి ఇప్పటివరకు మూడుసార్లు నోటీసులు ఇచ్చినా ఆయన బేఖాతరు చేశారు. విచారణకు రాకుండా పరారయ్యారు. మద్యం కేసులో విచారణకు హాజరుకావాలంటూ మార్చి 28, 29వ తేదీల్లో వరుసగా రెండుసార్లు సిట్ నోటీసులిచ్చినా ఆయన పట్టించుకోలేదు. ఈ కేసులో తనకు ఏ ప్రాతిపదికన నోటీసులిచ్చారో చెప్పాలంటూ .. సిట్ నోటీసుల్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ వేశారు. వాటిలో తాము జోక్యం చేసుకోబోమని కోర్టు స్పష్టం చేసింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు విచారణకు హాజరయ్యేందుకు రాజ్ కసిరెడ్డికి తగినంత సమయమిస్తూ ఏప్రిల్ 9న విచారణకు రావాలంటూ ఏప్రిల్ 5న సిట్ అధికారులు మూడోసారి నోటీసులిచ్చారు. ఈసారి కూడా ఆయన విచారణకు రాలేదు. ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసేసి పరారైపోయారు.

ఈ నేపథ్యంలోనే సిట్ అధికారుల బందం.. హైదరాబాద్‌లోని కసిరెడ్డికి చెందిన ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు చేస్తోంది. దర్యాప్తులో భాగంగా రాజ్ కసిరెడ్డిని విచారిస్తే స్కామ్‌కు సంబంధించి కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి ఎక్సైజ్ శాఖలోని పోలీసుల ప్రమేయంపైనా సిట్ దర్యాప్తు చేస్తోంది.

## రైతులను ఇబ్బంది పెట్టే రైస్ మిల్లులపై కఠిన చర్యలు

**విజయవాడ:** ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గొల్లపూడి మార్కెట్ యార్డ్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ధాన్యం కొనుగోలు, రైతులకు కలిగే ప్రయోజనాలపై సమీక్ష నిర్వహించారు. ధాన్యంలో తేమ కొలిచే యంత్రాలను పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులపై రైతులతో మాట్లాడారు. రైతులను ఇబ్బంది పెట్టే రైస్ మిల్లులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి మనోహర్ హెచ్చరించారు. ప్రతి ధాన్యపు బస్తానూ కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని మిల్లర్లకు ఆదేశాలు జారీ చేశారు. తరుగు, తేమ శాతం పేరుతో మోసం చేస్తే.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



## అడవులపైకి బుల్డోజర్లు

ఇదే.. కాంగ్రెస్ పాలన అంటూ హర్యానాలో మోడీ విమర్శలు

2



## గత ప్రభుత్వ హయాంలో గోశాలలోకి విజిలెన్స్ వాళ్లనూ అనుమతించలేదు

- టీటీడీ ఈవో శ్యామలరావు

**తిరుమల:** గత ప్రభుత్వ హయాంలో గోవులు తాగే నీళ్లు నాచు పట్టేసినా పట్టించుకోలేదని టీటీడీ ఈవో శ్యామలరావు అన్నారు. తిరుమలలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "నాచు పట్టేసిన

...మిగతా 2లో




# అమెరికాకు కీలక ఎగుమతులు నిలిపేసిన చైనా

## ముదురుతున్న ట్రేడ్ జంగ్

**బీజింగ్, ఏప్రిల్ 14:** అమెరికా మధ్య వాణిజ్య యుద్ధం మరింత తీవ్రమైంది. అరుదైన ఖనిజాలు, కీలకమైన లోహాలు, అయస్కాంతాలను ఎగుమతి చేయడం బీజింగ్ నిలిపివేసింది. దీంతో పశ్చిమ దేశాల్లో ఆయుధాలు, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, ఏరోస్పేస్ తయారీ, సెమీకండక్టర్ల కంపెనీలకు సమస్యలు ఎదురుకానున్నాయి. ఎగుమతులకు సంబంధించిన నిబంధనలను చైనా రూపొందిస్తోంది. అప్పటి వరకు చైనా పోర్టుల నుంచి మాగ్నెట్ల ఎగుమతులను నిలిపివేశారు. ఈ విషయాన్ని న్యూయార్క్ టైమ్స్ కథనంలో పేర్కొంది. ఈ నిబంధనలు అమల్లోకి వస్తే కొన్ని కంపెనీలకు శాశ్వతంగా వీటి సరఫరా నిలిచిపోనుంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదలు పెట్టిన వాణిజ్యయుద్ధానికి ప్రతి స్పందనగానే కీలక విడిభాగాల ఎగుమతులను చైనా ఆపేసింది. ప్రపంచ వ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న అరుదైన

...మిగతా 2లో

## వాణిజ్య యుద్ధంలో విజేతలెవరూ ఉండరు




**బీజింగ్, ఏప్రిల్ 14:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వేస్తున్న సుంకాల నేపథ్యంలో ఆగ్నేయాసియా దేశాల సందర్శనలో భాగంగా చైనా అధ్యక్షుడు జిన్పింగ్ వియత్నాంలో పర్యటిస్తున్నారు. అమెరికా-చైనా మధ్య తీవ్రస్థాయిలో వాణిజ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ తరుణంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పొరుగుదేశాల స్నేహం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. దానిలో భాగంగా తాజాగా ఆగ్నేయాసియా

...మిగతా 2లో

### కారు డోర్లు లాక్..

## ఊపిరాడక ఇద్దరు చిన్నారులు మృతి



**రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం దామరగిద్దలో విషాదం**

**హైదరాబాద్, మనం ప్రతినిధిః** కారు డోర్లు లాక్ అయి.. ఊపిరాడక ఇద్దరు చిన్నారులు మృతి చేందిన అత్యంత హృధయ విధారక విషాదకర సంఘటన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం దామరగిద్దలో చోటుచేసుకుంది. కారు డోర్లు లాక్ అవడంతో అందులో ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులు ఊపిరాడక మృతి చెందారు. దామరగిద్దకు చెందిన తన్మయశ్రీ (5), అభినయశ్రీ (4) అక్కాచెల్లెళ్ల పిల్లలు. వారు ఇంటి ముందు పార్క్ చేసిన కారులోకి వెళ్లగా, డోర్లు లాక్ పడ్డాయి. ఈ విషయాన్ని ఎవరూ గమనించలేదు. కారులోపల ఊపిరాడక ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఎంతసేపటికీ చిన్నారులు కనిపించకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వారి కోసం వెతికారు. అ తర్వాత కారులో చూద్దామని వచ్చి చూడగా.. అప్పటికే అపస్మారక స్థితిలో

...మిగతా 2లో

# అంబేద్కర్ విదేశీ విద్యా దీవెనను మళ్లీ ప్రారంభిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

అందరికీ హామీ ఇస్తున్నా. ప్రతిష్ఠాత్మక వర్సిటీలు అమరావతికి తరలివస్తున్నాయి. సబ్‌ప్లాన్ ద్వారా దళితుల అభివద్ధికి కషి చేస్తాం. రెసిడెన్షియల్ స్కూళ్లలో మెరుగైన భోజనం, నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. దళితులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. వారికి 8 లక్షల ఎకరాలను తెదేపా ప్రభుత్వం గతంలో పంపిణీ చేసింది'' అని చంద్రబాబు తెలిపారు.

అంతకుముందు గ్రామంలో అభివద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. అంబేద్కర్ చిత్రపటాల ప్రదర్శనను తిలకించారు. అనంతరం పీ4 కార్యక్రమాల లబ్ధిదారులతో చంద్రబాబు సమావేశమయ్యారు. మార్గదర్శులు, బంగారు కుటుంబం లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో సీఎం మాట్లాడి కష్టసుఖాలు తెలుసుకున్నారు. ''విదేశీ విద్యాదీవెన కోసం గతంలో రూ.467 కోట్లు ఖర్చు చేశాం. కానీ, వైకాపా హయాంలో కేవలం 437 మందికే అవకాశం కల్పించారు. ఎస్సీల ఆదాయం పెంచే దిశగా ప్రత్యేక కార్యక్రమాలు చేస్తున్నాం.

సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగిన వారు పేదలను ఆదుకోవాలి. విజన్ 2047 ద్వారా స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన కోసం కషి చేస్తున్నాం. ప్రపంచంలో చాలా మంది తెలుగువారు ఉన్నారు. ప్రవాసాంధ్రులు రాష్ట్ర అభివద్ధికి సహకరించాలి. మార్గదర్శి, బంగారు కుటుంబంలో అందరూ భాగస్వాములు కావాలి. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో పేదరిక నిర్మూలన కోసం పీ4 తెచ్చాం. ప్రైవేటు భాగస్వామ్యంతో పేదల జీవితాలు మార్చడం కోసం పనిచేస్తున్నాం. పొన్నెకల్లులో ఇంకా 300 మందికి మరుగుదొడ్లు లేవు, 6 నెలల్లో నిర్మిస్తాం. తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం'' అని చంద్రబాబు అన్నారు.

**2019-24 మధ్య భయంకర రాజకీయాన్ని చూశా**

ఎప్పుడూ చూడని భయంకర రాజకీయాన్ని 2019-24 మధ్య చూశానని సీఎం చంద్రబాబు అన్నారు. చివరకు తాను కూడా బయటకు రాలేని పరిస్థితి కల్పించారని ధ్వజమెత్తారు. జగన్ హెలికాప్టర్‌లో వస్తుంటే కిందనున్న చెట్లను నరికివేశారని గుర్తు చేశారు. ప్రజల అభిమానంతో తెదేపా తరపున 94శాతం అభ్యర్థులు గెలిచారని, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమాన్ని అందిస్తున్న ప్రభుత్వం తమదని చంద్రబాబు తెలిపారు.

## రానున్న మూడు రోజులు వర్షాలు

**అమరావతి:** రానున్న మూడు రోజులపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. భిన్నమైన వాతావరణ పరిస్థితుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉరుములతో కూడిన వర్షం పడే సమయంలో చెట్ల కిందకు వెళ్లి నిలబడకూదనని హెచ్చరించారు. 15వ తేదీన శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, ప్రకాశం, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ పనుల్లో ఉన్న రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## సాధ్యాసాధ్యాలపై కమిటీ ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

రాజధాని నిర్మాణం పూర్తి చేస్తాం. ఎన్టీఆర్ జిల్లాలోని మైలవరం నియోజకవర్గంలో స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నాం. అంతర్జాతీయ స్థాయి క్రీడలు నిర్వహించేలా స్పోర్ట్స్ సిటీ ఉండాలని సీఎం చంద్రబాబు చెప్పారు. దీని కోసం 2 వేల ఎకరాల భూమి అవసరం. కష్ణలంక భూముల్లో స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై కమిటీ ఏర్పాటు చేస్తున్నాం. నెలరోజుల్లోగా కమిటీ నివేదిక ఇస్తుంది. నివేదిక ఆధారంగా ముందుకెళ్తాం'' అని నారాయణ వివరించారు.

## హర్రాస్‌కు గోల్కొండ బ్లూ డైమండ్

**జెనివా, ఏప్రిల్ 14:** ఒకప్పుడు భారతదేశ రాజుల దగ్గర ఉన్న అరుదైన వజ్రం 'గోల్కొండ బ్లూ'ను వేలం వేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇండోర్, బరోడా మహారాజుల విలువైన సంపదలో ఇదీ ఒకటి. 23.24 క్యారెట్ల విలువైన ఈ వజ్రాన్ని మే 14న జెనీవాలో జరిగే '' క్రిస్టీస్ మాగ్నిఫిసెంట్ జ్యువెల్స్'' సేల్‌లో వేలం వేయనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

ఇది దాదాపు రూ.430 కోట్ల వరకు ధర పలికే అవకాశమున్నట్లు తెలుస్తోంది. దాని రాజ వారసత్వం, అసాధారణ రంగు, పరిమాణంతో 'ది గోల్కొండ బ్లూ' ప్రపంచంలోని అరుదైన నీలి వజ్రాలలో ఒకటిగా నిలిచిందని క్రిస్టీస్ ఇంటర్నేషనల్ జ్యువెలరీ హెడ్ రాహుల్ కడాకియా ఓ ప్రకటనలో తెలిపారు. ఇండోర్‌ను పరిపాలించిన మహారాజా యశ్వంత్ రావు హోల్కర్-2 వద్ద ఇది ఉండేది. 1923లో మహారాజా తండ్రి దీనిని ఓ బ్రాస్లెట్‌లో పొదిగించారు.

అనంతరం ఆభరణాలను రీడిజైన్ చేయడంలో భాగంగా ఇండోర్ పియర్ వజ్రాలతో చేసిన నెక్లెస్‌లో 'ది గోల్కొండ బ్లూ'ను అమర్చారు. ఫ్రెంచ్ చిత్రకారుడు బెర్నార్డ్ బౌటెట్ డి మోన్వెల్ అప్పట్లో గీసిన ఇండోర్ మహారాణి చిత్రపటంలో ఆమె ధరించిన ఆభరణాలలో ఈ వజ్రం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. 1947లో ఈ వజ్రాన్ని ప్రఖ్యాత న్యూయార్క్ ఆభరణాల వ్యాపారి హ్యారీ విన్‌స్టన్ కొనుగోలు చేశాడు. తర్వాత అది బరోడా మహారాజు వద్దకు చేరుకుంది. అనంతరం దీనిని ఓ ప్రైవేటు సంస్థ సొంతం చేసుకుంది.

## ఊపిరాడక ఇద్దరు చిన్నారులు మృతి

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న పిల్లలను గుర్తించి వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ దుర్ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## కుమారుడి పేరుపై లెజినోవా భారీ విరాళం

(మొదటి పేజీ తరువాయి)

అయ్యే రూ.17 లక్షల రూపాయలను తన కుమారుడు మార్క్ శంకర్ పేరిట పవన్ సతీమణి విరాళంగా టీటీడీ అధికారులకు ఇచ్చారు. అలాగే తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో అన్నా లెజినోవా అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారిని పవన్ సతీమణి అన్నా లెజినోవా సోమవారం తెల్లవారుజామున దర్శించుకున్నారు. సింగపూర్‌లో పవన్, అన్నా లెజినోవా దంపతుల కుమారుడు మార్క్ శంకర్ అగ్నిప్రమాదంలో గాయపడిన సంగతి తెలిసిందే. తన కుమారుడు కోలుకోవాలంటూ శ్రీవారిని మొక్కుకున్నారు అన్నా కొణిదెల. మార్క్ శంకర్ త్వరగానే కోలుకోవడంతో మొక్కును తీర్చుకునేందుకు నిన్న (ఆదివారం) తిరుమలకు వచ్చారు. ఈ సందర్భంగా గాయత్రి నిలయం వద్ద అన్నా లేజీ నోవాకు టీటీడీ అధికారులు స్వాగతం పలికారు. టీటీడీ నిబంధనల ప్రకారం డిక్లరేషన్‌పై సంతకం చేసి ఆమె వరాహస్వామిని దర్శించుకున్నారు. ఆపై పద్మావతి కళ్యాణ కట్టకు చేరుకుని.. శ్రీవారికి మొక్కుగా తలనీలాలు సమర్పించారు. రాత్రి తిరుమల్లోనే బస చేసిన అన్నా కొణిదెల.. ఈరోజు (సోమవారం) సుప్రభాత సేవలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

తిరుమలలో అడుగడుగునా ఆలయ సాంప్రదాయాలు పాటిస్తూ శ్రీవారికి మొక్కులు చెల్లించారు అన్నా కొణిదెల. దేవుడికి హారతిచ్చి, కొబ్బరికాయ కొట్టారు. ఈరోజు ఉదయం శ్రీవారిని దర్శించుకున్న అనంతరం.. రంగనాయకుల మండపంలో అన్నా లెజినోవాకు వేదపండితులు వేద ఆశీర్వాదం అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. స్వామివారి దర్శనానంతరం ఉదయం 10 గంటలకు తరిగొండ వెంగమాంబ నిత్యాన్నదాన సత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కుమారుడు మార్క్ శంకర్ పేరిట రూ.17 లక్షల విరాళాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులకు అందించారు. అనంతరం నిత్యాన్నదాన సత్రంలో శ్రీవారి భక్తులకు స్వయంగా అన్న ప్రసాదాన్ని వడ్డించారు. ఆపై భక్తులతో కలిసి అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో శ్రీ వెంకయ్య చౌదరి పాల్గొన్నారు. తిరుమల పర్యటన ముగించుకుని రోడ్డు మార్గం గుండా రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరారు డిప్యూటీ సీఎం సతీమణి. రేణిగుంట విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు అన్నా లెజినోవా పయనమయ్యారు.

కాగా.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అరకు పర్యటనలో ఉన్న సమయంలో సింగపూర్‌లో ఓ స్కూల్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఆయన కుమారుడు మార్క్ శంకర్ గాయపడ్డారు. శంకర్ కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. వెంటనే పవన్ కళ్యాణ్‌తో పాటు చిరు దంపతులు కూడా సింగపూర్‌కు వెళ్లి శంకర్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మార్క్ శంకర్ ఆరోగ్యం మెరుగుపడటంతో అక్కడి వైద్యుల సలహాతో చిన్నారిని వెంటనే హైదరాబాద్‌కు తీసుకొచ్చారు పవన్ కళ్యాణ్.

## అందాల జలపాతం.. ఆదమరిస్తే ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

2015- 25 మధ్య కాలంలో 40 మందికి పైగా పర్యాటకులు మతి చెందారు. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో పోలీసు అధికారులు స్పందించి అధికంగా ప్రమాదాలు జరుగుతున్న మొదటి స్టెప్ డేంజర్ పాయింట్ జలపాతం వద్ద పర్యాటకులు వెళ్లకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అంతేకాకుండా పర్యాటకులు దిగి, గల్లంతు కావడానికి కారణమవుతున్న బండరాళ్ల సొరంగాలను మూసివేసి, ప్రమాదాలకు కారణంగా ఉన్న బండరాళ్లను బ్లాస్టింగ్ ద్వారా తొలగించారు. దీంతో పాటు హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. గత రెండున్నరేళ్లుగా ఎటువంటి ప్రమాదాలు జరగలేదు. అలాగే రెండవ స్టెప్ వద్ద ప్రమాదాలు జరుగుతుండడంతో వలంటీర్లను అందుబాటులో ఉంచారు. బండరాళ్లపై డేంజర్ అని రాయించారు.

**ఇక్కడ జరిగిన కొన్ని ప్రమాదాలు**

- 2015లో కోటవురట్ల మండలం కె.వెంకటాపురం గ్రామానికి చెందిన పంచర్ల నాని(19), విశాఖ వాంబే కాలనీకి చెందిన ఆకాశ్ హేమసుందర్(22) రాయిపై కూర్చొని సరదాగా గడుపుతుండగా ఇద్దరూ ప్రమాదవశాత్తూ జారిపడి నీటమునిగి మతి చెందారు. 2015 నుంచి 2021 వరకు సుమారు 30 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు.
- 2024 సెప్టెంబరు 14న సరియా బహుబలి జలపాతం వద్ద విజయనగరం బాబామెట్టకు చెందిన సాయికుమార్ జారిపడి మునిగిపోతుండగా, అదే సమయంలోని అక్కడే ఉన్న విశాఖపట్నం నేవీకి చెందిన దిలీప్‌కుమార్ కాపాడేందుకు ప్రయత్నించారు. అయితే ఇద్దరూ మతి చెందారు.

2025 ఏప్రిల్ 13న పూర్ణామార్కెట్ పండావీధికి చెందిన ఇలా వాసు(23), రెల్లివీధి ఏవీఎన్ కళాశాల ప్రాంతానికి చెందిన వడ్డాది సత్యనరసింహమూర్తి మొదటి స్టెప్, రెండవ స్టెప్‌నకు మధ్యలో గల 40 అడుగుల లోతుగా ఉన్న ప్రదేశంలో ప్రమాదవశాత్తూ జారిపడి మతి చెందారు.

## అడవులపైకి బుల్డోజర్లు



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై స్పందించారు. హర్యానాలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ, అడవులపై బుల్డోజర్లు పంపడంలో తెలంగాణ ప్రభుత్వం నిమగ్నమై ఉందని విమర్శించారు. ప్రకృతి విధ్వంసం, వన్యప్రాణులకు హాని కలిగించడం కాంగ్రెస్ పాలనలో సాధారణ విషయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం అటవీ సంపదను నాశనం చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ప్రజలు మోసపోతున్నారని అన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇవాళ హర్యానాలో 800 మెగావాట్ల థర్మల్ పవర్ యూనిట్‌కు శంకుస్థాపన చేశారు.

## విశాఖలో నిండు గర్భిణి దారుణ హత్య

**మధురవాడ:** విశాఖ నగరంలోని మధురవాడలో దారుణం చోటు చేసుకుంది. స్థానిక ఆర్టీసీ కాలనీలో నిండు గర్భిణి హత్యకు గురయ్యారు. పీఎంపాలెం పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ కాలనీలోని ఓ అపార్ట్మెంట్లో జ్ఞానేశ్వర్ , అతడి భార్య అనూష (27) నివసిస్తున్నారు. మూడేళ్ల క్రితం ఇద్దరూ ప్రేమ వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం ఆమె 8 నెలల గర్భిణి. ఏదో విషయంలో సోమవారం ఉదయం వారిద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో జ్ఞానేశ్వర్ .. ఆమె గొంతు గట్టిగా నొక్కేశాడు. దీంతో ఆమె ఊపిరి అందక అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వెంటనే స్థానికుల సాయంతో ముందుగా ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడి నుంచి కేజీహెచ్కు అతడే తీసుకెళ్లాడు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మరోసారి క్యాబినెట్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

వంటి కీలక అంశాలపై ప్రధానంగా చర్చించనున్నారు.

**ఏపీ క్యాబినెట్.. చర్చించే అంశాలివే..**

సీఆర్డీయే 46వ అథారిటీలో ఆమోదించిన అంశాలన్నింటికీ ఏపీ క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. రాజధాని అమరావతి నిర్మాణం కోసం సీఆర్డీయే కమిషనర్ నిధులు సమీకరించుకునే అంశంపై మంత్రులు చర్చించనున్నారు. అనంతరం నిధుల సమీకరణకు క్యాబినెట్ అనుమతి ఇవ్వనుంది. అలాగే ఉండవల్లి, పెనుమాక రైతుల జరీబు భూములకు రిటర్నబుల్ ప్లాట్లు ఇచ్చే అంశంపై సీఆర్డీయే అథారిటీ తీసుకున్న నిర్ణయానికి క్యాబినెట్లో అనుమతి లభించనుంది.

## గత ప్రభుత్వ హయాంలో గోశాలలోకి విజిలెన్స్ వాళ్లనూ అనుమతించలేదు

(మొదటి పేజీ తరువాయి)

నీళ్లను గోవులకు పట్టించారు. పురుగులు పట్టేసి వినియోగించుకోలేని నీళ్లు పట్టిస్తారా? విజిలెన్స్ వాళ్లు వెళ్లేందుకు కూడా గతంలో అనుమతించలేదు. హిందువుల మనోభావాలతో ముడిపడి ఉన్న అంశంపై చాలా జాగ్రత్తగా ఉండాలి కదా? గోశాల ఆవరణలో చెల్లాచెదురుగా మెడిసిన్స్ పడేశారు. మార్చి 2021 నుంచి మార్చి 2024 వరకు భారీగా అక్రమాలు జరిగాయి. గత ఐదేళ్లలో చనిపోయిన ఆవుల వివరాలు దాచిపెట్టారు. ఆవులు లేని గోశాలకు దాణా పేరుతో నిధులు దుర్వినియోగం చేశారు.గత ప్రభుత్వ హయాంలోటీటీడీ ఐటీ విభాగంలో ఉన్నతస్థాయి అధికారి నియామకంలో నిబంధనలు గాలికొదిలేశారు. జీఎం స్థాయి అధికారి నియామకాల్లో అక్రమాలకు పాల్పడ్డారు. ఐటీ విభాగం వైఫల్యంతో భారీగా అక్రమాలు జరిగాయి. ఒక దళారి 50 సార్లు ఆర్జిత సేవల టికెట్ పొందారు. ఆవు నెయ్యి కొనుగోలులో అక్రమాలు చోటు చేసుకున్నాయి. అన్న ప్రసాదంలో నాణ్యత లోపించింది. స్వామివారికి ఆర్గానిక్ ప్రసాదాల పేరుతో పలు అక్రమాలు చేశారు. రూ.3 కోట్ల విలువైన సరకులకు రూ.25 కోట్లు చెల్లించారు. జూన్ 2024లో ఈవోగా బాధ్యతలు తీసుకునే ముందు సీఎం చంద్రబాబును కలిశా.టీటీడీలో వ్యవస్థలు పాడయ్యాయి.. వాటిని సరిచేయాలని ఆయన చెప్పారు. పది నెలల్లో ఎన్నో ప్రక్షాళన కార్యక్రమాలు చేపట్టాం. భక్తుల మనోభావాలకు అనుగుణంగా వసతులు మెరుగుపరిచాం.'' అని ఈవో శ్యామలరావు తెలిపారు.

## అమెరికాకు కీలక ఎగుమతులు నిలిపేసిన చైనా

(మొదటి పేజీ తరువాయి)

ఖనిజాల్లో దాదాపు 90శాతం చైనా నుంచే వెళుతున్నాయి. ఏప్రిల్ 2 నుంచి బీజింగ్ వీటి ఎగుమతులపై ఆంక్షలు విధించింది. అప్పటికే చైనా ఉత్పత్తులపై 54శాతం టారిఫ్‌లను ట్రంప్ విధించారు. వీటిని కాకుండా పర్మినెంట్ మాగ్నెట్లు, ఇతర ఉత్పత్తులను కూడా నిలిపేశారు. ఈ లోటును భర్తీ చేసుకోవడం అగ్రరాజ్యానికి ఇబ్బందికరంగా మారనుంది. అమెరికాతో వాణిజ్య ఉద్రిక్తతలు మరింత ముదిరితే ఇలాంటి చర్యలు చేపడతామని బీజింగ్ ఎప్పటి నుంచో హెచ్చరిస్తోంది. చైనా తాజాగా చేపట్టిన చర్యల ప్రభావం కేవలం అమెరికా వరకే పరిమితం కాదు.. అన్ని దేశాలపై ఉండనుంది. కీలక ఖనిజాల మైనింగ్, ప్రాసెసింగ్‌లో చైనా తనకున్న శక్తిని ఆయుధంగా వాడుతోంది. దీంతోపాటు ఎక్స్‌పోర్టు లైసెన్‌లను పరిమితం చేసే అవకాశాలు కూడా ఉన్నాయి. అమెరికాలోని లాక్‌హీడ్‌మ్మార్టిన్, టెస్లా, యాపిల్ వంటి సంస్థలు చాలా ముడిపదార్థాల కోసం బీజింగ్‌పైనే ఆధారపడుతున్నాయి. అమెరికా ప్రభుత్వం వద్ద రేర్ ఎర్త్ మినరల్స్ నిల్వలు ఇప్పటికే ఉన్నాయి. కానీ, తమ డిఫెన్స్ కాంట్రాక్టర్లకు సరఫరా చేయడానికి మాత్రం ఇవి సరిపోవు.

## విశాఖలో వైసీపీకి మరో గట్టి దెబ్బ

**విశాఖపట్నం:** విశాఖపట్నంలో తాజాగా వైసీపీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. వైసీపీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు.. ఆ పార్టీకి సోమవారం రాజీనామా చేశారు. ఆ పార్టీ సీనియర్ నేత బెహరా భాస్కర్ రావుతోపాటు 91వ వార్డు కార్పొరేటర్ జోత్స్న, 92వ వార్డు కార్పొరేటర్ బెహరా వెంకట స్వర్ణలత శివ దేవ రాజీనామా చేశారు. అయితే వీరు మరికొద్ది రోజుల్లో జనసేన పార్టీలో చేరనున్నారు. అందుకు ముహూర్తం సైతం ఖరారు అయినట్లు తెలుస్తోంది. జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమక్షంలో వీరు ఆ పార్టీ కండువా కప్పుకోనున్నట్లు సమాచారం.

మరోవైపు విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ రాజకీయ రసవత్తరంగా మారాయి. వైసీపీ నేత, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారిపై అవిశ్వాస తీర్మానానికి సంబంధించి నోటీసు జారీ చేసే నేపథ్యంలో ఇద్దరు వైసీపీకి కార్పొరేటర్లు రాజీనామా చేయడం ఆ పార్టీ నేతలో ఒకింత విస్మయం వ్యక్తమవుతోంది. అదీకాక ఈ అవిశ్వాస తీర్మానంపై ఏప్రిల్ 19వ తేదీన జీవీఎంసీ కౌన్సిల్ ప్రత్యేకంగా సమావేశం కానుంది.ఇంకోవైపు ఇటీవల 74వ డివిజన్ కార్పొరేటర్ వంశీ రెడ్డి సైతం వైసీపీని వీడారు. ఆయన కూడా జనసేన గూటికి చేరతారని తెలుస్తోంది. మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సమయం సమీపిస్తున్న తరుణంలో.. ఇలా ఒక్కొక్కరు వైసీపీని వీడిడం పట్ల ఆ పార్టీ నేతల్లో ఒకింత ఆందోళన రేకెత్తుతోంది. అదీకాక.. మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సిద్దమవుతోన్న తరుణంలో.. తమ కార్పొరేటర్లను రక్షించుకునేందుకు వైసీపీ సిద్దమైన సంగతి తెలిసిందే. అందులో భాగంగా క్యాంప్ రాజకీయాలకు తెర తీసింది. ఆ క్రమంలో పలువురు కార్పొరేటర్లను విదేశాలకు వైసీపీ తరలించిన సంగతి తెలిసిందే. కార్పొరేటర్లు గురించి ఇంత శ్రద్ధ తీసుకున్నా.. ఒకొక్కరిగా ఇలా జారీపోవడం పట్ల జిల్లా వైసీపీ నేతల్లో ఒకంత డీలాపడ్డతోన్న పరిస్థితులు నెలకొంటున్నాయి.

## వాణిజ్య యుద్ధంలో విజేతలెవరూ ఉండరు

(మొదటి పేజీ తరువాయి)

దేశాల పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా రాసిన ఎడిటోరియల్లో కీలక వ్యాఖ్యలు ప్రస్తావించారు. ''వాణిజ్య యుద్ధం, సుంకాల యుద్ధంలో విజేతలు ఉండరు'' అని పేర్కొన్నారు.చైనా వస్తువులపై అమెరికా సుంకాలు 145 శాతం కాగా..చైనా కూడా అంతే దూకుడు ప్రదర్శించింది. అమెరికా వస్తువులపై 125 శాతం సుంకాలు విధించింది. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య జరుగుతోన్న ఈ ట్రేడ్ వార్ ఎక్కడివరకు వెళ్తుందోనన్న ఆందోళన నెలకొంది. ట్రంప్ టారిఫ్‌లపై చైనా ప్రతిఘటించడంతో అమెరికాలో ఇతర దేశాల వస్తువులతో పోలిస్తే.. చైనా దిగుమతి వస్తువుల రేట్లు చాలా ఎక్కువగా ఉండనున్నాయి. ప్రతిఘటించని దేశాలకు 90 రోజుల విరామం ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతో పొరుగుదేశాలతో జట్టు కట్టేందుకు చైనా సిద్ధమవుతోంది. ఈక్రమంలోనే జిన్‌పింగ్ వియత్నాం వెళ్లారు. తర్వాత మలేసియా, కంబోడియా దేశాల్లో పర్యటించనున్నారు. ఏప్రిల్ 14 నుంచి 18 వరకు ఈ పర్యటన కొనసాగనుంది. ఈనేపథ్యంలో జిన్‌పింగ్ రాసిన ఒక ఎడిటోరియల్ వియత్నాం, చైనా మీడియాలో ప్రచురితమైంది. ''మన రెండు దేశాలు స్థిరమైన ప్రపంచ పారిశ్రామిక వ్యవస్థను, సరఫరా గొలుసులను, అంతర్జాతీయంగా సహకార వాతావరణాన్ని కాపాడుకోవాలి. వాణిజ్య యుద్ధంలో విజేతలు ఎవరూ ఉండరు'' అని పేర్కొన్నారు.ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధంపై చైనా ప్రతీకార చర్యలు ప్రారంభించింది. రక్షణ, విద్యుత్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలలో ఉపయోగించే అరుదైన ఖనిజాల్లో 90 శాతం చైనా నుంచే ఉత్పత్తి అవుతున్నాయి. ఈక్రమంలో ఏప్రిల్ రెండు నుంచి చైనా వాటిని నియంత్రణ జాబితాలో చేర్చింది. అమెరికాకు ఒక అరుదైన లోహాలు ఉత్పత్తి చేసే గని కూడా ఉంది. అయినా ఆ దేశ వినియోగంలో ఎక్కువ భాగం చైనా నుంచే దిగుమతి అవుతున్నాయి. ఈ ఖనిజాలపైనే కాకుండా అయస్కాంతాల ఎగుమతిని చైనా నిలిపివేసింది. కార్ల నుంచి క్షిపణుల వరకు దాదాపు అన్నింటి తయారీలో అయస్కాంతం అవసరం ఉంది. ఇప్పుడు వాటి షిప్‌మెంట్స్ పలు చైనా ఓడరేవుల్లో నిలిచిపోయాయని న్యూయార్క్ టైమ్స్ కథనం పేర్కొంది. ఈ క్రమంలో చైనా ప్రభుత్వం సరికొత్త నియంత్రణ వ్యవస్థను రూపొందిస్తోంది.

## దళిత యువకుడి ఇంటికి సీఎం చంద్రబాబు.. కుటుంబసభ్యుల్లో ఆనందం



ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఓ దళిత కుటుంబంలో ఊహించని సంతోషాన్ని నింపారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా గుంటూరు జిల్లా పొన్నెకల్లులో సోమవారం సీఎం పర్యటించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ప్రవీణ్ అనే యువకుడి ఇంటికి చంద్రబాబు వెళ్లారు. అతడి కుటుంబసభ్యులను ఆప్యాయంగా పలకరించారు. వారి బాగోగులు, ఆర్థిక స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ప్రవీణ్ నడుపుతున్న మెకానిక్ షెడ్డును సీఎం సందర్శించారు. అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని అతడి కుటుంబానికి భరోసా ఇచ్చారు.

# టిటిడి గోశాలలో గోవులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం

- గోవులకు తల్లిలా భావిస్తున్నాం
- గతంలో అన్నప్రసాదాలు, లడ్డూ ప్రసాదాలలో కల్తీ నెయ్యి వాడినట్లు నివేదికలు చెబుతున్నాయి
- టీటీడీ ట్రస్ట్ బోర్డు మాజీ ఛైర్మెన్ బి. కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలు నిరాధారమైనవి
- మార్చి 2021 నుండి మార్చి 2024 వరకు గోశాలలో చాలా అక్రమాలు జరిగాయి
- సీఎం ఆదేశాల మేరకు ఒక్కొక్కటి సరిదిద్దుకుంటూ వస్తున్నాం - టిటిడి ఈవో జె. శ్యామలరావు

**తిరుపతి, ఏప్రిల్14, మనం న్యూస్:** టిటిడి గోశాలలో గోవులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని టిటిడి ఈవో జె శ్యామల రావు తెలిపారు. గత పాలనలో జరిగిన అవకతవకలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు టిటిడిలో ఒక్కొక్కటి సరిదిద్దుకుంటూ వస్తున్నామని సోమవారం టిటిడి పరిపాలనా భవనంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, మార్చి 2021 నుండి మార్చి 2024 వరకు టిటిడి గోశాలలో పలు అక్రమాలు, అవకతవకలు జరిగాయని అప్పటి విజిలెన్స్ నివేదికలలో తేటతెల్లమవుతోందన్నారు. గోశాలలో గోవులకు కాలం చెల్లిన మందులు, మందులు ఎక్కడ తయారు చేశారో లేబుల్ లు కూడా లేని మందులు గోవులకు ఇచ్చినట్లు, పురుగులు పడ్డ దాణా, పాచిపట్టిన నీరు అందించారని, చనిపోయిన గోవుల వివరాలను నమోదు చేయలేదని టిటిడి విజిలెన్స్ నివేదికలలో నమోదైనా ఎలాంటి చర్యలు తీసుకోకుండా దాచిపెట్టారని మాట్లాడారు. తీవ్ర వ్యాధులతో ఉన్న గోవులను ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవాల్సి ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. హిందువుల మనోభావాలతో ముడిపడిన అంశమైనా ఏమాత్రం శ్రద్ధ తీసుకోలేదన్నారు. అప్పట్లో అధికారుల నిర్లక్ష్యం మూలంగా రెండు సార్లు గోశాలలో అగ్నిప్రమాదాలు జరిగాయన్నారు.

దాణా, మందుల సరఫరా కాంట్రాక్ట్ లోను భారీగా అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఇపుడు వీటిపై చర్యలు చేపట్టామన్నారు. గతంలో విజిలెన్స్ అధికారులను అనుమతించలేదని, ఇపుడు ఎవరైనా గోశాలకు వెళ్లి చూడవచ్చని, చాలా పారదర్శకంగా వ్యవహరిస్తున్నామన్నారు. టిటిడి గోశాలలో పాల ఉత్పత్తిలో గతం కంటే అదనంగా గోవులు పాలు ఇస్తున్నాయన్నారు. టిటిడి గోశాలలో 100 ఆవులు అనుమానాస్పదంగా



మరణించాయని, టిటిడి ప్రతిష్టను దెబ్బతీసే ఉద్దేశ్యంతో మాజీ టిటిడి ట్రస్ట్ బోర్డు చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి చేసిన ఆరోపణలను నిరాధారమైనవని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువుల మనోభావాలను దెబ్బతీసే ఉద్దేశ్యంతో చేసిన ఆరోపణలను ఈఓ తోసిపుచ్చారు. మార్చి 2021 నుండి మార్చి 2024 వరకు ఎస్వీ గోశాలలో చాలా అవినీతి కార్యకలాపాలు జరిగాయని, అప్పట్లో (మార్చి 2021 నుండి మార్చి 2024 వరకు తిరుపతిలోని ఎస్వీ డెయిరీ ఫామ్లో) టిటిడి విజిలెన్స్ నివేదిక సమర్పించిన వీడియో క్లిప్పింగ్లు మరియు గణాంక ఆధారాలను, టిటిడి గోశాలలో జరిగిన దుర్వినియోగాన్ని మీడియా ముందు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

గోవులు ప్రతి నెల సగటున 15 ఆవులు వయోభారం, వ్యాధులతో చనిపోతాయని చెప్పారు. 2024 ఏడాది నాటికి 179 గోవులు మరణించగా, 2025 ఏడాదిలో జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలో 43 గోవులు మృతి చెందాయన్నారు. చనిపోయిన గోవులు వయోభారం, వ్యాధుల కారణంగా సహజ మరణాలేనన్నారు. ఇదిలా ఉండగా ఈ సంవత్సరం ఇప్పటి వరకు 59 లేగ దూడలు జన్మించాయన్నారు. వాస్తవాలు ఇలా వుంటే టిటిడి బోర్డు మాజీ అధ్యక్షులు బి. కరుణాకర్ రెడ్డి అసత్య ఆరోపణలు చేశారని, గోవుల దాణాను విస్మరించినట్లు, సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే మృతి చెందినట్లు నిరాధారమైన ఆరోపణలు చేయడం దురదృష్టకరమన్నారు.

బి. కరుణాకర్ రెడ్డికి నిజంగా గోవుల మీద ఆందోళన వుంటే వారి పాలనలో జరిగిన అక్రమాలపై ఎందుకు దర్యాప్తు చేయలేదన్నారు. టిటిడి గోశాలకు కొత్తగా డైరెక్టర్ వచ్చాక ఈ అవకతవకలు, అక్రమాలు, నిర్లక్ష్యం తదితర అంశాలన్నీ వెలుగులోకి వస్తున్నాయన్నారు. గతంలో దళారులకు అడ్డాగా మారిన టిటిడిని , ఇపుడు దళారులపై పూర్తిగా కట్టడి చేసి చర్యలు చేపట్టామన్నారు. గత జూన్ నుండి టిటిడిలో అన్నప్రసాదం మరియు శ్రీవారి ప్రసాదాల రుచిని పెంచడం, లడ్డూ నాణ్యత, సేవలలో పారదర్శకత, దర్శన టిక్కెట్లు మరియు వసతి, దళారులను కట్టడిచేయడం, టిటిడి ఐటీ విభాగాన్ని బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. టిటిడి ఐటీ విభాగంలో అనర్హుని ఐటీ జీఎంగా చీఫ్ ఇంజనీర్ ర్యాంక్ హోదాలో నిబంధనలకు విరుద్ధంగా నియమించారని, అక్రమ నియామకంపై ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గత జూన్ నెలకు ముందు శ్రీవారి లడ్డు ప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యి సరఫరాదారులపై చర్యలు చేపట్టి వారిని బ్లాక్ లిస్ట్ లో పెట్టామన్నారు.

అదేవిధంగా శ్రీవారి అన్నప్రసాదాల తయారీకి సేంద్రీయ ఉత్పత్తులను విరాళంగా ఇచ్చే పేరుతో, దాతలు రూ.5 కోట్ల విలువైన కల్తీ సేంద్రీయ ఉత్పత్తులను సరఫరా చేసినందుకు, దాదాపు రూ.25 కోట్ల వరకు దాతలకు టిటిడిలో పలు ప్రివిలేజేస్ కల్పిస్తూ పాస్ పుస్తకాల ప్రయోజనాన్ని పొందేలా నిర్ణయాలు తీసుకున్నారని, నిబంధనల ప్రకారం ఇలాంటి విరాళాలకు ఎలాంటి ప్రత్యేక హక్కులు లేకున్నా ప్రివిలేజ్డ్ పాస్ పుస్తకాలు జారీ చేశారన్నారు.

ఇలాంటి అక్రమాలను తాము రద్దు చేశామని ఈవో మీడియా ముందు చెప్పారు. ప్రస్తుతం భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదాలు, లడ్డూ ప్రసాదాల రుచి, నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా పంపిణీ చేస్తున్నామని, భక్తుల మనోభావాలు కాపాడటానికి కట్టుబడి ఉన్నామని, ఎప్పటికప్పుడు భక్తుల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నామని, ప్రస్తుతం అందుతున్న సేవలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో టిటిడి జేఈఓ వీరబ్రహ్మం,టీటీడీ డిప్యూటీ ఫారెస్ట్ ఆఫీసర్ మరియు ఇన్-చార్జ్ డైరెక్టర్ ఎస్వీ గోశాల శ్రీనివాసులు, వీజీఓ విజిలెన్స్ రామ్కుమార్ తదితరులు హాజరయ్యారు.

# టీటీడీలో గోవుల మృతిపై ఎటువంటి విచారణకైనా సిద్ధం

- గోవుల మరణాలు ముమ్మటికీ వాస్తవం
- మేం బయటపెట్టిన చనిపోయిన ఆవుల ఫోటోలు నిజమైనవే
- మార్ఫింగ్ అంటున్నవారు దానిని నిరూపించాలి
- మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిడిమాండ్

**తిరుపతి, ఏప్రిల్ 14 మనం న్యూస్:** టీటీడీ గోశాలలో గోవుల మరణాలపై వైయస్‌ఆర్సీపీ వాస్తవాలను బయటపెట్టడంతో వాటిని కప్పిపుచ్చుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ శ్యామలరావులు తలోరకంగా స్పందిస్తున్నారని మాజీ టీటీడీ చైర్మన్, వైయస్‌ఆర్సీపీ అధికార ప్రతినిధి భూమన కరుణాకర్‌రెడ్డి మండిపడ్డారు. తిరుపతి క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ గోవుల మరణాలపై వైయస్‌ఆర్సీపీది




దుష్ప్రచారం అన్న చంద్రబాబు దీనిపై విచారణకు ఆదేశిస్తారా అని సవాల్ చేశారు. ఇవి వాస్తవమని నిరూపించేందుకు మేం సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి అసలు గోవుల మరణాలే జరగలేదంటుంటే, ఈఓ, టీటీడీ చైర్మన్లు మాత్రం ఆవులు మరణించాయని అంగీకరించారని, దీనికి చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇంకా ఆయనేమన్నారంటే...

సీఎం చంద్రబాబు టీటీడీ గోశాలలో ఒక్క గోవు చనిపోలేదని, కావాలనే వైయస్‌ఆర్సీపీ వివాదం సృష్టిస్తూ, దుష్ప్రచారం చేస్తోందని మాట్లాడారు. ఈరోజు ఉదయం టీటీడీ ఈఓ శ్యామలరావు 43 ఆవులు చనిపోయాయని ప్రకటించారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయకుడు నిన్న మీడియా సమావేశంలో మాట్లాడుతూ 22 ఆవులు చనిపోయాయని ప్రకటించారు. సీఎం ఒక్క గోవు కూడా చనిపోలేదని చెబుతుంటే, దానికి విరుద్దంగా టీటీడీ ఈఓ, చైర్మన్లు రెండు వేర్వేరు సంఖ్యల్లో ఆవుల మరణాలను గురించి ప్రకటనలు చేశారు. అంటే వీరిద్దరూ అబద్దాలు చెప్పారా? అలా మాట్లాడిన వారిని వారి పదవుల నుంచి చంద్రబాబు తొలగించగలరా?

**మార్ఫింగ్ ఫోటోలంటూ తప్పించుకునే యత్నం**

టీటీడీ గోశాలలో గోమాతలు చనిపోతున్నాయని మేం బయటపెట్టిన ఫోటోలు ఫేక్, మార్ఫింగ్ అంటూ టీటీడీ ఒక ప్రకటనలో ఖండించింది. దీనిని టీడీపీ తన సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ చేసింది. మేం మరోసారి చాలా స్పష్టంగా భగవంతుడి మీద ప్రమాణం చేసి చెబుతున్నాం. ఏదైతే ఫోటోలు ఆరోజు మేం బయటపెట్టామో అవి నిజమైనవే. కాదు అని నిరూపించేందుకు ఎవరు ముందుకు వచ్చినా స్వాగతిస్తాం. ఎటువంటి విచారణకు అయినా మేం సిద్ధంగా ఉన్నాం. ఒక్క ఫోటో కూడా మార్ఫింగ్ కాదు. అవి గోశాలలో చనిపోయిన ఆవుల ఫోటోలే. టీటీడీ ఈఓ, చైర్మన్ చెబుతున్న సంఖ్య కన్నా ఎక్కువగానే గోవులు మరణించాయి. మేం గోవుల మరణాలను బయటపెట్టగానే వెంటనే అవి అబద్దం అని టీటీడీ ప్రకటన విడుదల చేసింది. ఈరోజు ఈఓ మాట్లాడుతూ నెలకు పదిహేను ఆవులు చనిపోతున్నాయని అన్నారు. ఉన్న మొత్తం పదిహేను వందల ఆవులు ఎన్ని సంవత్సరాల్లో చనిపోతాయో కూడా ఆయన చెప్పాలి.

## సుప్రభాత సేవలో అన్నా లెజినోవా

**తిరుమల,ఏప్రిల్ 14,మనం న్యూస్:** కలియుగ దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా లెజినోవా సోమవారం వేకువజామున శ్రీవారి సుప్రభాత సేవలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు



చెల్లించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం ఏర్పాటు చేశారు దర్శనం అనంతరం రంగనాయక మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా టిటిడి అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.అనంతరం ఆలయం నుండి అఖిలాండం వద్దకు చేరుకొని కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న బేడీ ఆంజనేయస్వామిని దర్శించుకుని గాయత్రీ నిలయం అతిథిగృహం వసతి సముదాయం కు వెళ్లారు. ఏప్రిల్ 08వ తేదీన సింగపూర్ స్కూల్లో జరిగిన అగ్నిప్రమాదం నుంచి తమ కుమారుడు మార్క్ శంకర్ సురక్షితంగా బయటపడడంతో శ్రీవారికి ముక్కలు చెల్లించుకునేందుకు ఆదివారం రాత్రి తిరుమలకు చేరుకున్న అన్నా లెజినోవా అన్యమతస్థురాలు కావడంతో ఆలయ సాంప్రదాయాలకు అనుగుణంగా వ్యవహరించారు. టిటిడి నియమాల ప్రకారం అన్యమతస్తులు తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనానికి వస్తే శ్రీవారిపై నమ్మకం ఉంది అంటూ తిరుమల తిరుపతి దేవస్థానానికి డిక్లరేషన్ ఇవ్వవలసి ఉంటుంది. అందుకు అనుగుణంగా అన్న లెజినోవా ఆదివారం రాత్రి గాయత్రి నిలయం అతిథిగృహం వసతి సముదాయంలో టిటిడి అధికారులు ఇచ్చిన డిక్లరేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం భూ వరాహ స్వామిని దర్శించుకుని. పద్మావతి విచారణ కార్యాలయం సముదాయంలోని కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి ముక్కుని తీర్చుకున్నారు. టిటిడి శ్రీ వెంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్ట్ కు విరాళం అందజేసిన అన్న లెజినోవా

తిరుమలలోని శ్రీ వెంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్ట్ కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సతీమణి అన్న లెజినోవా ల కుమారుడు మార్క్ శంకర్ పేరుతో ఒక పూట మధ్యాహ్నం అన్న ప్రసాదానికి అయ్యే ఖర్చు రూ. 17 లక్షల విరాళంగా అందజేశారు. అనంతరం భక్తులకు స్వయంగా అన్న ప్రసాదం వడ్డిస్తూ వారితో పాటుగా కలసి సహపంక్తి భోజనం చేశారు.

# అణగారిన వర్గాల ఆత్మబంధువు బి.ఆర్.అంబేద్కర్

**తిరుపతి, ఏప్రిల్ 14 మనం న్యూస్:** అణగారిన వర్గాల ఆత్మ బంధువు డా బి.ఆర్.అంబేద్కర్ అని భారతదేశంలో కుల వ్యవస్థను నిర్మూలించి అందరికి సమాన అవకాశాలు కల్పించిన మహానుభావుడని, దళితులు, వెనుకబడిన వర్గాలు, స్త్రీలకు కూడా ఉన్నత అవకాశాలు కల్పించినప్పుడే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని హైదరాబాద్ కు చెందిన ప్రముఖ న్యాయ నిపుణులు శ్రీ శ్రీకాంత్ పేర్కొన్నారు. అంబేద్కర్ 134వ జయంతిని సోమవారం ఉదయం తిరుపతి మహతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా శ్రీ శ్రీకాంత్ మాట్లాడుతూ, ప్రతికూల పరిస్థితులలో కూడా అట్టడుగు స్థాయి నుండి భారత రాజ్యాంగ నిర్మాతగా ఎదిగిన అంబేద్కర్ను భారతీయులందరూ ఆదర్శంగా భావించాలన్నారు. ఆయనకు అన్ని శాస్త్రాల్లో విస్తృతమైన పరిజ్ఞానం ఉండేదని తెలిపారు. హైందవ సమాజం ఎల్లప్పుడూ సర్వసమానత్వాన్నే బోధిస్తుందని, ఎలాంటి అసమానతలు లేని సమాజం కోసం ఉద్యమించిన మహానాయకుడని వివరించారు. అణగారిన వర్గాల ఎదుగుదలకు విద్య సరైన ఆయుధమని భావించి, అందుకు అవసరమైన చట్టాలను తీసుకువచ్చినట్లు



తెలిపారు. మన ఆలోచన విధానం మారిన నాడే అంబేద్కర్ ఆశయాలు సిద్ధిస్తాయని తెలిపారు. అంబేద్కర్ కృషి వల్లనే సగటు భారతీయుడు నేడు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు అనుభవించగలుగుతున్నారని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన కోరారు. అనంతరం విజయవాడకు చెందిన ప్రముఖ పాత్రికేయులు శ్రీ విద్యా సాగర్ రావు ప్రసంగిస్తూ, అంబేద్కర్ మహనీయుడు కావడం వెనక సమాజంలోని అన్ని వర్గాల వారి సహకారం ఉందన్నారు. కష్టపడేతత్వం ఉంటే ఎవరైనా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు. భారతదేశ ప్రజలకు అనుగుణంగా రాజ్యాంగాన్ని నిర్మించారని తెలిపారు. అంబేద్కర్ రచనలను చదివితే ఒక దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక ప్రగతికి అవసరమయ్యే అన్ని అంశాలను

తెలుసుకోవచ్చన్నారు. దళితులు విద్యనభ్యసించి చైతన్య వంతులైనప్పుడే సమాజంలో అంతరాలు తొలగిపోతాయని తెలియజేశారు. ఆయన స్ఫూర్తితో జీవితాన్ని అభివృద్ధిచేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించి, సమసమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. దళిత, గిరిజనులను గౌరవిస్తూ టిటిడి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. అనంతరం పలువురు టిటిడి ఉద్యోగులు ప్రసంగించారు. తర్వాత టిటిడి లోని అన్ని విభాగాల్లో ప్రతిభ కనబరిచిన 45 మంది ఉద్యోగులకు మెమెంటోలు అందజేశారు. అంతకుముందు డిప్యూటీ ఈవో శ్రీ ఆనంద రాజు శ్రీవారి చిత్రపటానికి పూజలు నిర్వహించి, డా బి.ఆర్.అంబేద్కర్ పటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు దేవేంద్ర బాబు, లక్ష్మణ్ నాయక్, ఇతర అధికార ప్రముఖులు, టిటిడి ఉద్యోగులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బి.ఆర్ అంబేద్కర్

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**మల్యాల, ఏప్రిల్ 14, ( మనం న్యూస్):** రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ప్రపంచ మేధావి భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ బి ఆర్ అంబేద్కర్ అని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు మల్యాల మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగడి బజార్ నుంచి బ్లాక్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన శాంతియుత ప్రజాజీవనం స్వతంత్ర సమానత్వం ప్రాతిపాదికలుగా భారతీయ సమాజాన్ని పునర్ నిర్మించాలన్నదే అంబేద్కర్ ఆశయమని అన్నారు. ఆయన బాటలో నడుస్తూ ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సి.ఐ. నీలం రవి, ఎస్సై నరేష్, దారం ఆది రెడ్డి, దొంగ ఆనందరెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్, లక్ష్మణ్, మండల యూత్ అధ్యక్షుడు శనగరపు తిరుపతి, మండల యూత్ ఉపాధ్యక్షుడు నాగులపేట సంజీవ్, హరినాథ్, కొండాబత్తి అనిల్ కుమార్, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## పారదర్శకంగా టీడీఆర్ బాండ్లు పంపిణీ

- టిడిఆర్ బాండ్లు అందజేసిన కమిషనర్ ఎన్.మౌర్య

**తిరుపతి, ఏప్రిల్ 14 మనం న్యూస్:** నగరంలో ఏర్పాటు చేసిన మాస్టర్ ప్లాన్ రోడ్లలో భూములు కోల్పోయిన వారికి పారదర్శకంగా టీడీఆర్ బాండ్లు పంపిణీ చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్




ఎన్.మౌర్య అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో జరుగుతున్న టిడిఆర్ మేళాలో అర్హత పొందిన 22 మందికి సోమవారం టిడిఆర్ బాండ్లను కమిషనర్ అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్లలో భూములు కోల్పోయిన ప్రతి ఒక్కరిని ఆన్లైన్ చేయించడం కోసం మేళా నిర్వహిస్తున్నామని అన్నారు 95శాతం ఆన్లైన్ చేశామని, కోర్టు కేసులు, ప్రభుత్వ, టిటిడి భూములు, 22 ఏ కింద ఉన్నవి మాత్రమే పెండింగ్లో ఉన్నాయని అన్నారు.

ఇప్పటి వరకు ఐదు బాండ్లు ఇచ్చామని, సోమవారం 22 టిడిఆర్ బాండ్లు లబ్దిదారులకు స్వయంగా అందజేశామని అన్నారు. ఖాళీ జాగాలకు లొకాలిటీ వాల్యూ ప్రకారం గుర్తించామని అన్నారు. టిడిఆర్ బాండ్ల కమిటీ సమావేశమై 96 మందికి ప్రీ అప్రూవల్ తీసుకుని అర్హత ఉన్నట్లు గుర్తించామని అన్నారు. వీరందరూ గిఫ్ట్ డీడ్ ఇస్తే తరువాత బాండ్లు అందజేస్తామని అన్నారు. వీరు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలుగా తిరుపతి, రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు కూడా ఏర్పాటు చేశామని అన్నారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ ఆర్.డి, విజయభాస్కర్, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డీసీపీ మహా పాత్ర, ఏసీపి లు బాలాజి, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆదర్శప్రాయుడు

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**తిరుపతి, ఏప్రిల్ 14 మనం న్యూస్:** సామాజిక న్యాయం కోసం జీవితాంతం కృషి చేసిన వ్యక్తి అంబేద్కర్ అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. ప్రజలు ప్రస్తుతం అనుభవిస్తున్న వివిధ హక్కులు అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే సాధ్యమైందని ఆయన తెలిపారు. చెన్నారెడ్డి కాలనీలోని



ఏడు కాలనీల బలహీనవర్గాల అభ్యున్నతి సంఘం సోమవారం ఉదయం బి ఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలును నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యతోనే మార్పు సాధ్యమని నమ్మి బడుగు,బలహీనవర్గాల వారిలో విద్య పట్ల చైతన్యం తీసుకువచ్చిన మహనీయుడు అంబేద్కర్ అని అన్నారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లు ఎస్సీ, ఎస్టీ, బిసి వర్గాలు పొందటానికి అంబేద్కర్ సామాజిక దృక్పథమే కారణమని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు మహేష్ యాదవ్, రాజా రెడ్డి, కెవి రమణ, జయప్రకాష్, రమేష్ బాబు, ఈశ్వర ప్రకాష్, రాజశేఖర్, దిలీప్, జీవకోన సుధాకర్, బాబ్జీ, మునస్వామి, కెఎంకె బాబ్జీ, ఆముదాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వమంతా జాతర



ఆకాశమంతా ఎత్తులో నువ్వు ఉండబట్టే
మేం ఇక్కడ బతికి బట్టకట్టగల్గుతున్నాం
భూగోళంపై నువ్వు నిలవబట్టే
భూమిపై మేం ప్రాణాలతో ఉండగల్గుతున్నాం
చూపుడువేలుతో చరిత్ర మార్చి
బతుకులకు చరిత్ర కల్పించిన్నావు

అంబేడ్కరా...
అందరూ ఆకలై మూడుపూటల
తిని నిద్రపోతున్న వేళ
నువ్వు మాకోసం అర్థ ఆకలితోనే
పుస్తకాలతో కడుపు నింపుకున్నావు

దేశం మొత్తం నీపై నిందలు వేస్తుంటే
జాతిజనుల కోసం
రాజ్యాంగమై బదులు చెప్పావు

అంబేడ్కరా...
తూర్పున సూర్యుడు,
కాళ్ళకింద భూమి
ఉంటాయో ఉండవో తెలియదుగాని
నువ్వు మాత్రం మా గుండెల్లోనే ఉంటావు
విశ్వమంతా నీ చుట్టే తిరుగుతుంది .

- తంగిరాల.సోని
9676609234

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

# అమ్మాయిల్లో ఆనందానికి అవకాశం తగ్గుతోంది?



ఆనందానికి మించిన ఆరోగ్యం లేదు, సంతోషానికి మించిన సంపద లేదు.అంతే కాదు సేవకు మించిన స్వర్గం లేదు. ఎన్ని విజయాలు సాధించిన అంతిమ లక్ష్యం సంతోషమే కావాలి,అదేనిజమైన విజయం అవుతుంది.అమ్మాయిలకు ఎందులో సంతోషం ఉంటుందంటే? బాల్యం ఆహ్లాదకరంగా, ఆనందంగా సాగాల్సిన దశలో అనేక కట్టుబాట్లు నిబంధనలతో సంతోషానికి స్వేచ్ఛకు స్థానం లేకుండా పోతుంది. పెండ్లి అయిందంటే అంతా హ్యాపీనే అనుకుంటారు.కానీ సామాజిక అసమానతలు,లింగ వివక్ష అమ్మాయిల సంతోషానికి గండి కొడుతున్నాయని పరిశోధనలు చెబుతున్నాయి. బాధ్యతలు సమానంగా పంచుకున్నప్పుడే ఆడవాళ్లకు అసలైన ఆనందం. ఆర్ట్ బెస్ట్ థెరపీలు గ్రూప్ యాక్టివిటీలో పాల్గొనడం వంటివి ఆడవాళ్ళలో సంతోషాన్ని పెంచుతాయంటున్నారు. ఒక హాస్య సన్నివేశాన్ని ఒక అబ్బాయి, ఒక అమ్మాయి చూస్తున్నా వేళ.. అబ్బాయి అది చూస్తూ పడి పడి నవ్వుకున్నాడు, పక్కనే ఉన్న అమ్మాయి ముఖంలో ఓ చిన్న చిరునవ్వు తప్ప పెద్దగా ఆస్వాదించలేదు. ఆ దృశ్యం అమ్మాయిని ఎందుకు అంతగా నవ్వించలేకపోయింది అనే సందేహం శాస్త్రవేత్తలకు వచ్చింది. దీంతో ఆడ,మగవారిలో ఎవరు ఎక్కువ ఆనందంగా ఉంటారని అధ్యయనం చేశారు. మహిళల్లో హ్యాపీనెస్ గ్రాఫ్ తగ్గుతోందని తేల్చారు..

‘అందుకు కారణాలు ఏంటి? ఏం చేయాలో! పరిశీలిద్దాం..

‘గత నలభై ఏళ్లుగా మహిళల జీవితాల్లో ఎన్నో మార్పులు, కోరిన చదువులు, నచ్చిన కొలువులు, ఆర్థిక భద్రత, స్వేచ్ఛ ఉన్నా ఆనందం మాత్రం తగ్గిందంటున్నారు. వాటన్నింటితో పాటే ఆందోళన, ఒత్తిడి,డిప్రెషన్,కోపం, ఒంటరితనం,నిద్రలేమి వంటి వన్నీ అంతే పాలలో పెరగడమే ఇందుకు కారణం. ముఖ్యంగా కెరియర్‌తో పాటు ఇంటిని పిల్లల్ని చూసుకోవాల్సి రావడంతో ఒక లాంటి స్తబ్దత నెలకొంది. దానితో వయస్సు పెరిగే కొద్దీ ఆనంద స్థాయిలు మరింత పలుచబడుతున్నాయి. అదే సమయంలో స్వచ్ఛంద సంస్థల్లో చేరడం సాయం చేయడం ద్వారా ఇతరులను ఆనందంగా ఉంచే ప్రయత్నంలో మహిళలే ముందుంటూ ఇందులోనే తమ ఆనందాన్ని వెతుక్కుంటున్నారని చెబుతున్నాయి పరిశోధనలు. ఆ అంశాన్నే ఐక్యరాజ్యసమితి ఈ ఏడాది ‘అంతర్జాతీయ ఆనంద దినోత్సవం-‘కోసం కేరింగ్ అండ్ షేరింగ్’థీమ్‌గా ఎంచుకొంది.‘ఎందుకు తగ్గింది’అంటే? మగవాళ్ళతో పోలిస్తే మహిళలే సంతోషంగా జీవితాన్ని ప్రారంభించాలి అనుకుంటారు. కౌమార దశలోకి ప్రవేశించగానే ఎన్నో కలలు, ఊహలు కానీ జీవితం అలా ఉండదు కదా! పనిలో,వేతనంలో,లింగ వివక్ష, కట్టుబాట్లతో అవమానాల్ని ఎదుర్కొంటున్నారు. దాంతో అసంతృప్తికి లోనవుతున్నారు.

అంతేకాదు! నిరంతర శ్రమ ఒకప్పుడు పిల్లల పెంపకం ఇల్లు దిద్దుకోవడం మహిళల లక్ష్యంగా ఉండేది.కానీ ఇప్పుడు వీటితోపాటు వృత్తి ఉద్యోగాలు అవసరంగా మారాయి, వాటిలో విజయం కోసం శక్తిని మించి శ్రమించి అలసిపోతున్నారు. అదీ పురుషులకే వరంగా మారింది. స్త్రీల సంపాదనతో కుటుంబాల భారాన్ని తగ్గించుకునే వాళ్ళు హ్యాపీగా ఉంటున్నారు.

మహిళలల్లో స్వీయ విమర్శ నిజానికి మంచిదే కానీ తమ బలహీనతల్ని సరిదిద్దుకునే క్రమంలో తీవ్ర ఒత్తిడికి, అసంతృప్తికి,అసహనానికి గురై ఆనందానికి దూరం అవుతున్నారు. ఇలాంటి దశలో ‘సంతోషానికి కొన్ని సూత్రాలు’.. ఉదయాన్నే బాల్కనీలోకి వచ్చిన బుల్లి పిట్టల్ని చూస్తూ నచ్చిన కాఫీ రుచిని ఆస్వాదించండి. అది రోజంతా ఆనందంగా ఉండేలా చేస్తుంది. అమ్మో ఎంతపనో అంటూ వంట ఇంటి పనుల్ని ముందే ఊహించుకొని భారంగా ఫీల్ కావద్దు. అన్ని మనమే చేయాలనుకోవద్దు పని విభజన చేయండి,అప్పటికి కుదరకపోతే నచ్చిన పాటల్ని పాడుతూనో, వింటూనో ప్రశాంతంగా పూర్తి చేయండి. ఇదీ నాకు మంచి వ్యాయామం అనుకుంటే ఒత్తిడి తగ్గి హుషారుగా అనిపిస్తుంది. మీలోని భావోద్వేగాలని అణచి పెట్టొద్దు. కుటుంబీకులు,స్నేహితులతో పంచుకోండి భారం తగ్గి సంతోషంగా అనిపిస్తుంది. ప్రతి రోజు వృత్తి ఉద్యోగాల్లో విజయం కోసం మీరంతా కష్టపడగలరు. ఉదయము సాయంత్రం అరగంట వ్యయం చేయండి. సెరటోనిన్, డోపమైన్, ఎండార్ఫిన్లూ విడుదలై ఆనందాన్ని పెంచుతాయి. వీలైనంత ఎక్కువగా ప్రకృతిలో గడపండి కదిలే మేఘం,ఊగే చెట్ల కొమ్మలు, ఎండుటాకుల సవ్వడులు, సెలయేటి గలగలలు ఇవన్నీ మనసుకు స్వాంతన కలిగించి ఆనందాన్నిస్తుంది. నచ్చిన సినిమా మళ్లీ చూడండి, ఇష్టమైన పుస్తకం మళ్ళీ చదవండి. ఇలా మీతో మీరు ఆనందంగా ఉండే ప్రయత్నం చేయండి. ఏరులన్నీ కలిసి నదులై పారినట్లే చిన్న చిన్న సంతోషాలే చిరకాల ఆనందమార్గాలవుతాయి. అంతే కాదండి ఈ మధ్యలో జరుగుతున్న‘ఆడపిల్లలపై అత్యాచారాలు ఎక్కువైపోతున్న వేళ‘.. ఇంకొన్ని జాగ్రత్తలు అవసరం. ఆడపిల్లలు తెలిసిన ప్రదేశమైనా ఏళ్లుగా తిరిగిన చోటైన చీకటి వేళ మగ మృగాలు తచ్చాడుతుంటాయి. అప్రమత్తంగా ఉండండి, చీకటి దారులైతే ఎంతో షాట్ కట్ అయినా వెళ్లొద్దు. వెళ్లాల్సివస్తే దూరమైన జన సమ్మర్దంగా ఉండే ప్రాంతాలు అయితే సురక్షితం. అలాంటి స్నేహితులతో నేను నడుచుకుంటూ వెళుతున్నాను. నేను వెళ్లే వరకు గమనించు, అంటూ లైవ్ లొకేషన్ షేర్ చేయండి. కాల్ చేసి ఇంటికి చేరాను అని చెప్తేనే సురక్షితమైన గ్రహించమనండి. అత్యవసరంగా పోలీస్ విభాగానికి కాల్ వెళ్లేలా ఫోన్ సెట్టింగ్‌లో పెట్టుకోండి. నైట్ డ్యూటీ చేసేఆడవాళ్లు మరింత జాగ్రత్తగా ఉండాలి. పగలైతే పర్లేదు కానీ రాత్రుల్లో రిస్క్ తీసుకోవద్దు. క్యాబ్లో ప్రయాణిస్తున్న వేళ సోషల్ మీడియానో, కాలక్షేపం కోసం సినిమానో చూసుకుంటూ ప్రయాణించకండి. చుట్టూ పరిసరాలను గమనించుకోండి. వేరే మార్గంలో తీసుకెళ్తే వెంటనే ప్రశ్నించండి. భయపడకుండా మీ వాళ్లకు ఫోన్ చేసి ఏ దారిలో తీసుకెళ్తున్నారో చెప్తూ ఉండండి.

ఇవన్నీ స్వీయ రక్షణ చర్యలే.. ఎంత ధైర్యవంతులైన కొత్త ప్రదేశానికి వెళ్తున్న వేళ కాస్త కంగారు మామూలే, దాన్ని ఆపద తలపెట్టాలను కొనేవాళ్ళు మిమ్మల్ని గమనిస్తూ ఉంటారని మరిచిపోకండి. నమ్మకం కల్పించడానికి అక్క, చెల్లి అని మాట కలుపుతారు.అలా అన్న వాళ్లంతా చెడ్డవాళ్ళు అనుకోవద్దు, మన జాగ్రత్తలో మనం ఉండాల్సిందే.ఆడవాళ్లపై జరిగిన సంఘటనలన్నీ వేరే చోట్ల, మన దగ్గర అలాంటి వాటికి ఆస్కారం లేదన్న ధీమా మంచిది కాదు. ముప్పెప్పుడైనా ఎక్కడైనా పొంచి ఉండవచ్చు, కాబట్టి అలసత్వం వదిలి జాగ్రత్తలు పాటించాలి. అమ్మాయిలు బయటకు వెళ్లి, ఇంటికి చేరే దాకా వారి తల్లిదండ్రుల్లో కలిగే మనోవేదన వెలకట్టలేనిది. అమ్మాయిలూ.. జాగ్రత్తలు పాటిస్తూనే, నైరాశ్యంలోకి వెళ్ళకండా చరిత్రలో, ప్రస్తుతం మహిళల హక్కులకై



విరోచితంగా పోరాడుతున్న వారి నుండి స్ఫూర్తిని పొందండి. ధీరోదత్తతో పడిలేచిన కెరటంలా మహిళా శక్తిని చూపించు సమాన హక్కల పోరాట ప్రయాణానికి సహకరించే బాధ్యత ముమ్మాటికీ సమాజానిదే. ప్రభుత్వాలు ఆలసత్వం వహిస్తే సృష్టికే ప్రమాదం సుమా!.

- మేకిరి దామోదర్
9573666650

# నిశ్శబ్దంగా ఉబ్బుతున్న దేహం



భారతదేశం యొక్క ఆరోగ్య సంరక్షణ గణనీయమైన మార్పులకు లోనవుతోంది, ఇది అంటువ్యాధి కాని వ్యాధుల ప్రాబల్యం మరియు మానసిక ఆరోగ్యంపై పెరుగుతున్న అవగాహన ద్వారా గుర్తించబడింది. నేటి ఆధునిక జీవనశైలి, వేగవంతమైన నగరీకరణ వల్ల భారత ప్రజలు అనారోగ్య సమస్యల పట్ల ఎక్కువగా బాధపడుతున్నారు. ముఖ్యంగా ఊబకాయం, మానసిక అనారోగ్యం, మరియు క్యాన్సర్ లాంటి సమస్యలు వేగంగా పెరుగుతున్నాయి. ఇటీవల విడుదల చేసిన ఐపిఎస్‌ఓఎస్ రిపోర్ట్ 2024 క్యాన్సర్, ఊబకాయం మరియు మానసిక ఆరోగ్య రుగ్మతవంటి క్లిష్టమైన సమస్యల బారిన పడుతున్నారని తెలియచేస్తున్నాయి. ఇవి అన్ని వయస్సుల వారికీ గ్రామీణ-పట్టణ ప్రజలకు, పేద-ధనిక అన్న తేడా లేకుండా ప్రభావితం చేస్తున్నాయి. 31 దేశాలను కవర్ చేస్తూ, ఐపిఎస్‌ఓఎస్ హెల్త్ సర్వీస్ రిపోర్ట్ 2024, భారతీయ పౌరులను ఇబ్బంది పెడుతున్న ప్రస్తుత ఆరోగ్య సమస్యలపై సమగ్రమైన రిపోర్ట్ ను అందించింది. జాబితాలో ముందు వరుసలో క్యాన్సర్ (47%), ఊబకాయం (28%) మరియు మానసిక ఆరోగ్య రుగ్మత(26%) ఉన్నాయి. పెరుగుతున్న ఇతర సమస్యలలో మాదకద్రవ్య దుర్వినియోగం (16%) మరియు ఒత్తిడి (14%) ఉన్నాయి. ఊబకాయం మరియు మానసిక ఆరోగ్య రుగ్మతలు వంటి ఆరోగ్య పరిస్థితులు ఒక దాని పై ఒకటి అనుసంధానించబడి ఉంటాయి గత సంవత్సరం తో పోలిస్తే ఊబకాయం (+10%) మరియు మానసిక ఆరోగ్య రుగ్మత(+7%) ల సమస్యలను తగ్గించడానికి తక్షణ అవసరం ఏర్పడుతోంది. ఊబకాయం ఒక శారీరక సమస్య మాత్రమే కాదు, ఇది మానసిక ఆరోగ్యంపై కూడా తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది. ఊబకాయంతో బాధపడే వ్యక్తులు చాలా సందర్భాలలో తక్కువ ఆత్మవిశ్వాసం, డిప్రెషన్, ఒత్తిడి, మరియు మానసిక ఒడిదొడుకులకు గురవుతుంటారు. అదే సమయంలో, మానసిక అనారోగ్యం ఉన్నవారు శారీరక చొరవను తగ్గించడమూ, అస్వస్థమైన భోజన అలవాట్లు అవలంబించడమూ వల్ల ఊబకాయం రావడం జరుగుతుంది. ఈ రెండు సమస్యలు చక్రాకారంగా ఒకదాన్నొకటి బలపరుస్తూ, వ్యాధుల బారిన పడే ప్రమాదాన్ని పెంచుతాయి. తల్లి ఆరోగ్యమే శిశువు ఆరోగ్యానికి ఆధారం. గర్భధారణ సమయంలో తల్లి సరైన పోషకాహారం తీసుకోవడం, మెరుగైన వైద్య సేవలు పొందడం వల్ల శిశువు యొక్క శారీరక మరియు మానసిక ఎదుగుదల బలపడుతుంది. కానీ భారతదేశంలో ఇప్పటికీ అనారోగ్యంతో బాధపడుతున్న గర్భిణులు, రక్తహీనత, మరియు అనుత్తమ వైద్య సౌకర్యాలు వంటి సమస్యలు గర్భిణీ స్త్రీల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయి. తల్లి ఆరోగ్యం బలపడితేనే శిశువు ఆరోగ్యంగా ఎదుగుతాడు. పోషకాహార లోపం ఉన్న తల్లులు మాత్రమే కాదు, మానసిక ఒత్తిడిలో ఉన్న గర్భిణుల శిశువులు కూడా భవిష్యత్తులో అనారోగ్య సమస్యలతో బాధపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అందుకే గర్భిణులకు ప్రతిరోజు మానసిక ధృఢత్వం, పౌష్టికాహార సలహాలు, కుటుంబంలో మద్దతునిచ్చే వాతావరణం అత్యవసరం. మొత్తం మీద, మాతా శిశు సంరక్షణను మెరుగుపరచడం అంటే దేశ భవిష్యత్తును బలపరచడం. ఆరోగ్యకరమైన తల్లులు, ఆరోగ్యవంతమైన శిశువులను అందిస్తారు. ప్రస్తుతం భారత దేశం లో ఆరోగ్యసేవల విషయం లో వెనుకబడడానికి కారణం అధిక వైద్య ఖర్చులు, చికిత్సకు వేచి ఉండే సమయం, డాక్టర్ ల సేవలు అందుబాటులోలేకపోవడం, వృద్ధుల సంరక్షణ అవసరాలు పెరుగుతుండటం, వైద్య సిబ్బంది కొరత, వ్యవస్థలో అధిక నిబంధనలు, జాప్యం ఇలా ఎన్నో కారణాలతో ప్రజా ఆరోగ్యం కుంటుపడుతోంది. ఊబకాయం, మానసిక ఆరోగ్య రుగ్మతలాంటి సమస్యలపై ముందస్తు జాగ్రత్తలు తీసుకొని, ప్రభుత్వ ప్రైవేట్ రంగాలు, కుటుంబాలు కలిసి పనిచేస్తే, ఆరోగ్యంగా ఉన్న భారతదేశాన్ని నిర్మించటం సాధ్యమే. ఇప్పుడు చర్య తీసుకోవాల్సిన సమయం. మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ, వ్యక్తిగత, కుటుంబ మరియు సమాజ స్థాయిలో మద్దతు, సరైన పోషకాహార మార్గదర్శకాలు, నియమిత వ్యాయామం, అవసరమైనప్పుడు ప్రొఫెషనల్ కౌన్సిలింగ్ తప్పనిసరిగా తీసుకోవాలి. ఊబకాయాన్ని తగ్గించాలంటే, మానసిక స్థిరత్వం చాలా ముఖ్యం. మానసిక ఆరోగ్య రుగ్మతమెరుగైతేనే శారీరక ఆరోగ్య మార్గంలో కూడా విజయవంతం కావచ్చు.



- డా. అట్ల శ్రీనివాస్ రెడ్డి
9703935321

## ‘జై ఆంధ్ర జననీ’ గీతం

వందనమో తెలుగు తల్లి! వందనమోయమ్మా!
సుందర నందనమిది నీ మందిరమోయమ్మా!
జై ఆంధ్ర జననీ! జయహో! తెలుగు తల్లీ!
ఐదు కోట్ల ఆంధ్రుల కడుపార కన్నతల్లీ!
జై ఆంధ్ర జననీ! జయహో! తెలుగు తల్లీ!

శాతవాహనుల చల్లని పాలనలో ప్రభవించి
ఇక్ష్వాకుల ఏలుబడిలో వైదిక విద్యలు నేర్చి
చాళుక్యుల శతాబ్దాల సారథ్యంలోన సాగి
తిరుగులేని రాజ్యంగా దీపించెను ఆంధ్రావని :జై:

గోదావరి కృష్ణ పెన్న నాగావళి వంశధార
తరంగాల ఉరవడిలో బంగరు పంటలు పండగ
విశాల సాగర తరగల వింజామరలై వీయగా
ప్రకృతిసంపదకు గని పచ్చనిమాగాణుల మణిహారం :జై:

నన్నయ తిక్కన ఎర్రన ఆంధ్రభారతము నిచ్చిరి
కృష్ణదేవరాయ లష్టదిగ్గజ కవులను పెంచెను
అన్నమయ్య క్షేత్రయ్య పదకవితలు వెలయించిరి
వేమన కవి సార్వభౌమ శ్రీనాథుడు అసమానులు :జై:

తెల్లవారినెదిరించిన వీరుడు మన అల్లూరి
గుండుకు గుండెల నొడ్డిన ఆంధ్ర కేసరెవరమ్మా!
ధన మాన ప్రాణాలనె బలిపెట్టిన నీ బిడ్డలె
భారత స్వాతంత్ర్య సమరయోధులు కద ఓయమ్మా! :జై:

స్వాతంత్ర్యం జన్మహక్కు అని చాటిరి నీ బిడ్డలు
వందేమాతరమంటూ ఉద్యమించి సాగినారు
మాకొద్దీ తెల్లదొరతనం నినదించెను గరిమెళ్ళ
భారత జాతీయ జెండ రూపశిల్పి మన పింగళి :జై:

స్త్రీ లోకమునుద్ధరించె సంస్కర్తగ కందుకూరి
ప్రజల భాషకే పట్టము కట్టెను పండిత గిడుగు
నవ్య సాహితికి నాందీ పలికెను మన గురజాడ
అభ్యుదయ పథాన కవిత నడిపె మహాకవి శ్రీశ్రీ :జై:

నందమూరి అక్కినేని సావిత్రి చిరంజీవి
మహానటులు ఇంకెందరొ కళాకాంతులెగజిమ్మిరి
రాఘవేంద్ర బాహుబలి ఆరారార్ రాజమౌళి
ఖండాంతర ఖ్యాతి తెచ్చె చలనచిత్ర రంగానికి :జై:

ద్వారం సాలూరు ఘంటసాల సుశీల బాలూ
కీరవాణి సంగీత స్వర సుధలను కురిపించిరి
హరికథా పితామహుడు ఆదిభట్ల నీ తనయుడు
జెగజ్జెట్టి కోడి రామ్మూర్తి నీదు ముద్దుబిడ్డ :జై:

ఆంధ్రరాష్ట్రమున కసువులు బాసె పొట్టి శ్రీరాములు
తెలుగువారి ఆత్మగౌరవం పెంచెను నందమూరి
అమరావతి రాజధానిగా నిల్పెను చంద్రబాబు
అజేయులుగ నీ బిడ్డల దీవింపుము ఓయమ్మా! :జై:

తిరుపతి శ్రీకాళహస్తి శ్రీశైలం బెజవాడ
పుణ్యక్షేత్రాల కెల్ల పుట్టినిల్లు ఈ నేల
చెక్కభజన కోలాటం తప్పెటగుళ్ళు సాములు
జానపదుల వినోదాలు ఆనందం వెల్లివిరియ :జై:

వందనమో తెలుగు తల్లి! వందనమోయమ్మా!
సుందర నందనమిది నీ మందిరమోయమ్మా!
జై ఆంధ్ర జననీ! జయహో! తెలుగు తల్లీ!

- సీరపాణి
87902 32565

# అంబేద్కరిజం ఒక సజీవ శక్తి



అంబేద్కరిజం నేడు భారత్‌లో ఒక సజీవశక్తి. బాబా సాహెబ్ అని కూడా పిలువబడే భీమ్‌రావు రాంజీ అంబేద్కర్ (ఏప్రిల్ 1891 - డిసెంబర్ 6, 1956) ఒక భారతీయ న్యాయవేత్త, రాజకీయవేత్త, తత్వవేత్త, మానవ శాస్త్రవేత్త, చరిత్రకారుడు ఆర్థికవేత్త కూడా. భారత దేశంలో బౌద్ధమతానికి పునరుజ్జీవనోద్యమకారుడిగా, ఆయన భారతదేశంలో ఆధునిక బౌద్ధ ఉద్యమానికి ప్రేరణనిచ్చాడు, దీనిని దళిత బౌద్ధ ఉద్యమం అని కూడా పిలుస్తారు. స్వతంత్ర భారతదేశ మొదటి న్యాయమంత్రిగా, ఆయన భారత రాజ్యాంగ ప్రధాన రూపశిల్పి. అనేక సామాజిక, ఆర్థిక అడ్డం కులను అధిగమించి, అంబేద్కర్ భారతదేశంలో కళాశాల విద్యను పొందిన మొదటి దళితులలో ఒకరు అయ్యారు. బాంబే హైకోర్టులో న్యాయవాద వృత్తిని కొనసాగిస్తున్నప్పుడు, అంటరానివారికి విద్యను అందించడానికి వారిని ఉద్ధరించ డానికి ప్రయత్నించాడు. దీనిని సాధించడానికి ఆయన మొదటి వ్యవస్థీకృత ప్రయత్నం బహిష్కృత హితకారిణి సభ, ఇది విద్య మరియు సామాజిక-ఆర్థిక మెరుగుదలను ప్రోత్స హించడానికి, అలాగే ఆ సమయంలో అణగారిన వర్గాలుగా పిలువబడే బహిష్కృతుల సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి ఉద్దేశించబడింది. 1947 ఆగస్టు 15న భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత, కాంగ్రెస్ నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం అంబేద్కర్‌ను దేశ మొదటి న్యాయ మంత్రిగా పనిచే యడానికి ఆహ్వానించింది, దానిని ఆయన అంగీకరించారు. ఆయన జీవితాంతం బౌద్ధమతాన్ని అధ్యయనం చేశారు మరియు 1950ల ప్రాంతంలో, ఆయన పూర్తిగా బౌద్ధమతం వైపు దృష్టి సారించారు. బౌద్ధమతంలోకి అధికారికంగా మారాలని ప్రణాళిక వేశారు.

అంబేద్కర్ తన దేశస్థుల లక్షలాది మంది మానవ హక్కులను కోల్పోవడానికి దారితీసిన క్రమానుగత అసమా నత, అన్యాయం ఆధారంగా ఒక సమాజాన్ని వారసత్వంగా పొందారు. అన్నింటికంటే ముఖ్యంగా అందరికీ సామాజిక న్యాయం ఆధారంగా హిందూ సమాజాన్ని సంస్కరించడం, పునర్నిర్మించడం అవసరమని ఆయన భావించారు. సామాజిక ఉద్రిక్తతను పెంచే మరియు పెంచే కుల వ్యవస్థను రద్దుచేసి, న్యాయం, సమానత్వం సోదరభావంపై ఆధారపడిన కులరహిత సమాజాన్ని స్థాపించాల్సిన సమయం ఆసన్న మైంది. భారతదేశంలోని అణగారిన వర్గాల ప్రధాన ప్రతిని ధులలో బి.ఆర్. అంబేద్కర్ ఒకరు. బాబాసాహెబ్ అంబేద్కర్ 'సామాజిక న్యాయం' యొక్క నిర్దిష్ట నిర్వచనం లేదా సిద్ధాంతాన్ని ప్రతిపాదించలేదనేది వాస్తవం. అయితే, ప్లేటో మరియు రాల్స్ ప్రతిపాదించిన సామాజిక న్యాయం సిద్ధాం తంలో పొందుపరచబడిన సూత్రాల వెలుగులో,అంబేద్కర్ ఆలోచనలలో పొందుపరచబడిన సామాజిక న్యాయం యొక్క ప్రాథమిక సాంస్కృతిక మరియు నిర్మాణాత్మక సూత్రాలను ఊహించవచ్చు. ఆర్థిక సమస్యలు రాజకీయ స్వభావం కలిగి ఉన్నప్పటికీ, అవి ప్రాథమికంగా సామాజికమైనవి. ప్రైవేట్ వ్యవస్థాపకతకు ఆటంకం కలగకుండా ఉత్పాదకతను ప్రోత్సహించగలిగేలా ప్రభుత్వం తన ఆర్థిక కార్యకలాపాలను ప్లాన్ చేసుకోవాలని అంబేద్కర్ ఎత్తి చూపారు.

అంబేద్కర్ వ్యవసాయ సంస్కరణలు, చిన్న కమతాలు భారత కరెన్సీకి సంబంధించిన వ్యవసాయ ఉత్పాదకత సమస్యలు, ప్రాంతీయ ఆర్థిక ప్రణాళిక సమస్య వంటి ఆర్థిక అంశాలను అధ్యయనం చేశారు. సాధారణ ఆర్థిక శాస్త్రం, సోషలిజం ఆర్థిక శాస్త్రం, వ్యవసాయ ఆర్థిక శాస్త్రానికి ఆయన అపారమైన కృషి చేశారు. భారతదేశంలో ప్రాంతీయ ఆర్థిక శాస్త్రం యొక్క నిజమైన చిత్రాన్ని ఆయన ప్రదర్శించారు. ఆయన ఆర్థిక ఆలోచనలు ఇప్పటికీ సందర్భోచితంగా ఉన్నాయి. అంబేద్కర్ నిబద్ధత అంతర్గత స్థిరత్వం, బంగారు కరెన్సీతో బంగారు ప్రమాణంపై ఆధారపడిన స్వయంచాలక వ్యవస్థ మాత్రమే ఈ కావాల్సిన లక్ష్యాన్ని సాధించగలదని ఆయన నమ్మారు. ప్రభుత్వాలు ప్రజల నుండి సేకరించిన వనరులను నియమాలు, చట్టాలు మరియు నిబంధనల ప్రకారం మాత్రమే కాకుండా, ‘విశ్వసనీయత, జ్ఞానం మరియు ఆర్థిక వ్యవస్థ‘ని చూడటానికి కూడా ఖర్చు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. అక్టోబర్ 10, 1927న బొంబాయి శాసన మండలిలో జరిగిన చర్చలో జోక్యం చేసుకుంటూ,అంబేద్కర్ వ్యవసాయ ప్రశ్నకు పరిష్కారం ‘పొలాల పరిమాణాన్ని పెంచ డంలో కాదు, మనలాంటి పొలాలలో ఎక్కువ మూలధనం మరియు ఎక్కువ శ్రమను ఉపయోగించే సాంద్ర వ్యవసాయం సాగులో ఉంది‘ అని వాదించారు. కీలక పరిశ్రమలు రాష్ట్ర



యాజమాన్యంలో ఉండాలని, మిగులు శ్రమను వ్యవసాయం నుండి ఇతర ఉత్పాదక వృత్తులకు తరలించడానికి పారిశ్రామికీకరణ అవసరాన్ని కూడా ఆయన నొక్కి చెప్పారు.

పశ్చిమ దేశాల ఉదారవాద, సమాజవాద సంప్రదాయాలను మధ్యవర్తిత్వం చేయడంలో అంబేద్కర్ రాజకీయ తత్వశాస్త్రం గొప్ప సామర్థ్యాన్ని కలిగి ఉంది. బౌద్ధమతం వంటి ప్రజాస్వామ్య, మానవతా హేతువాద మతాన్ని నైతికత అనుబంధ జీవనానికి మూలంగా ఆయన ప్రతిపాదిస్తాడు. దళిత సమాజంలోని వ్యక్తిగత సభ్యుల బాధల గురించి ఆయన మాట్లాడేటప్పుడు, సమానత్వం, స్వేచ్ఛ సోదరభావం ఆధారంగా ఒక ఆదర్శ నైతిక సమాజాన్ని ప్రదర్శిస్తున్నాడు. కాబట్టి అనేక విషయాలలో ఆయన నెహ్రూ వంటి ఉదారవాద ఆలోచనాపరుల నుండి భిన్నంగా ఉంటారు.

భారత సమాజంలో అత్యంత అణగారిన వర్గాలకు అంబేద్కర్ అత్యంత ముఖ్యమైన పాత్ర పోషించారు. నిర్దిష్ట సామాజిక, ఆర్థిక రాజకీయ హక్కులతో పౌరులుగా దళితుల సమస్యలను చూసిన మొదటి వ్యక్తి ఆయన. ఆయన కృషి ఫలితంగానే అణగారిన వర్గాలలో పూర్తిగా కొత్త రకమైన చైతన్యం ఉద్భవించింది. దళితుల సమస్యలు తప్పనిసరిగా రాజకీయపరమైనవని అంబేద్కర్ నిరూపించారు. రాజకీయాల్లో మతం యొక్క వ్యూహాత్మక సాధనాన్ని దాని దుష్ఫలితాలను అంబేద్కర్ రెండు సందర్భాలలో చూశారు. దేశంలోని సగం కంటే ఎక్కువ జనాభా ఉన్న దళితులు మహిళలు అటువంటి సామాజిక వ్యవస్థ యొక్క క్రూరమైన బాధితులైన రెండు వర్గాలు. అటువంటి పితృస్వామ్య, కుల ఆధారిత మతపరంగా నియమించబడిన సామాజిక మరియు రాజకీయ వాతావరణంలో లౌకికవాదం మరియు నిజమైన ప్రజాస్వామ్య క్రమాన్ని స్థాపించడం ఆధునిక రాజ్యానికి నిజంగా కష్టం. దళిత హక్కుల రక్షణ కోసం ఆయన మూక్ నాయక్, బహిష్కృత్ భారత్ మరియు సమానత్వ జనతా వంటి అనేక పత్రికలను ప్రారంభించారు. హిందూ దేవాలయాలలోకి ప్రవేశించే హక్కు కోసం కూడా ఆయన పోరాటాన్ని ప్రారంభించారు. పట్టణాల్లోని ప్రధాన నీటి ట్యాంకుల నుండి నీటిని తీసుకోవడానికి ఉపయోగించుకోవడానికి అంటరాని సమాజం యొక్క హక్కు కోసం పోరాడటానికి ఆయన మహాద్లో సత్యాగ్రహానికి నాయకత్వం వహించారు.


1950లో మహాబోధి సొసైటీ జర్నల్లో ప్రచురించబడిన బుద్ధుడు మరియు అతని మతం యొక్క భవిష్యత్తు అనే వ్యాసంలో, అంబేద్కర్ మతం బౌద్ధమతంపై తన అభిప్రాయాలను సంగ్రహించారు. మే 1956లో, ‘నేను బౌద్ధమతాన్ని ఎందుకు ఇష్టపడుతున్నాను ప్రస్తుత పరిస్థితులలో ప్రపంచానికి అది ఎలా ఉపయోగపడుతుంది‘ అనే శీర్షికతో అంబేద్కర్ చేసిన ప్రసంగం లండన్‌లోని బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ నుండి ప్రసారం చేయబడింది. తన ప్రసంగంలో అంబేద్కర్ ఇలా అన్నాడు. బౌద్ధమతం ప్రజ్ఞ, కరుణ,సమతలను బోధిస్తుంది. మంచి జీవితం కోసం మనిషి కోరుకునేది ఇదే. అంబేద్కర్ స్వయంగా చెప్పినట్లుగా పురుషులు మర్త్యులు. అలాగే ఆలోచనలు. ఒక మొక్కకు నీరు పెట్టడం ఎంత అవసరమో ఆలోచనకు ప్రచారం అవసరం. లేకపోతే రెండూ వాడిపోయి నశించిపోతాయి. మతం వ్యక్తిగత మైనదని మరియు దానిని తనలోనే ఉంచుకోవాలని అంటా రు. ప్రజా జీవితంలో దాని పాత్రను పోషించనివ్వ కూడదు. బుద్ధ ధర్మం తీసుకువచ్చిన కొత్త సమాజం గురించి అంబే ద్కర్ దార్శనికతతో ఆయన అనుచరులు కదిలిపోయారు.

అంబేద్కర్ ఒక సామాజిక-రాజకీయ సంస్కర్త, ఆధునిక భారతదేశంపై లోతైన ప్రభావాన్ని చూపారు. స్వాతంత్ర్యానం తర భారత్‌లో ఆయన సామాజిక-రాజకీయ ఆలోచన రాజకీ య వర్ణపటంలో గౌరవాన్ని పొందింది. ఢిల్లీలోని 26 అలీ పూర్ రోడ్లోని ఆయన ఇంట్లో అంబేద్కర్ స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేశారు.అంబేద్కర్ మరణానంతరం 1990లో భారతదేశ అత్యున్నత పురస్కారం భారతరత్న లభించింది. ఆయన చొరవలు జీవితంలోని వివిధ రంగాలను ప్రభావితం చేశాయి. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ విశ్వవిద్యాలయం; ముజఫర్‌పూర్‌లోని బి.ఆర్.అంబేద్కర్ బీహార్ విశ్వవిద్యాలయం; మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లోని అంబేద్కర్ మరాత్వాడ విశ్వవిద్యాలయం, నాగపూర్‌లో అంబే ద్కర్ అంతర్జాతీయ విమానాశ్రయం వంటి అనేక ప్రభుత్వ సంస్థలకు ఆయనపేరు పెట్టారు. భారత పార్లమెంట్ భవనం లో అంబేద్కర్ యొక్క పెద్ద అధికారిక చిత్రం ప్రదర్శించ బడింది. భారత రాజ్యాంగ నిర్మాతగా ఆయన అనేక రాజ్యాం గాలకు నమూనా. ఆయన ఆలోచనలు సమకాలీన సమాజా నికి అన్ని రంగాల అభివృద్ధికి అనుకూలంగా ఉంటాయి.

- డా. పి.ఎస్. చారి
8309082823

# భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

- అంబేద్కర్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి
- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్.



**కర్నూలు ఏప్రిల్ 14(మనం న్యూస్):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహోన్నతుడు అని, వారి స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం నగరంలోని స్థానిక పాత బస్టాండ్ లో భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గారి జయంతిని పురస్కరించుకొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సమాజంలో అందరికీ సమాన హక్కులు కల్పించడం లో ముఖ్యపాత్ర వహించాడన్నారు. అందుకొరకే జన్మించి వంద సంవత్సరాలు పూర్తి అయిన బిఆర్ అంబేద్కర్ గారిని ఇప్పుడు కూడా మనం స్మరించుకుంటు ఘనంగా జయంతి ఉత్సవాలు నిర్వహించుకుంటున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీఏ ప్రభుత్వం లో రాజ్యాంగం లోని విధివిధానాలను సక్రమంగా అమలు పరుస్తోందని మంత్రి అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి అని మంత్రి అన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఏఆశయాలతో అయితే రాజ్యాంగ పీఠికను వ్రాశారో అందులో భాగంగా మాలాంటి సామాన్యులు కూడా బడుగు బలహీన వర్గాల కు చెందిన వారం రాజకీయపరంగా చైతన్యవంతులమై చట్ట సభల్లో అడుగుపెట్టి ప్రజల గొంతును అక్కడ వినిపించే అవకాశం కలిగిందన్నారు. ఇదంతా కేవలం బిఆర్ అంబేద్కర్ గారు ఏ ఆశయముతో అయితే రాశారో అందులో భాగమేనని సగర్వంగా చెప్పుకుంటున్నానని అన్నారు. మా వెనుక ఉన్న ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలంటే రాజ్యాంగంలోని ప్రతి అంశాన్ని గౌరవించుకుంటు, ఆహక్కులను పొందుతూ సమ సమాజ స్థాపన లక్ష్యంగానే ముందుకు సాగాలన్నారు, మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ గారు ఈ సంవత్సరం రాజ్యాంగ ఉత్సవాలను కూడా పాటించాలని పార్లమెంటులో చెప్పారని అంటే ఇది రాజ్యాంగం యొక్క గొప్పతనం అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి ఆశయాలను కొనసాగించు కుంటు రాబోయే రోజుల్లో బడుగు బలహీన వర్గాల వారు కూడ రాజ్యాంగ ఫలాలను ఆస్వాదిస్తూ ముందుకు సాగాలని కోరుకుంటున్నాను అని ఎంపీ అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు సమ సమాజంలో అందరికీ సమాన హక్కులు కావాలని, అంటరానితనాన్ని రూపుమాపాలని, పోరాడిన వ్యక్తి అని అందుకొరకే ఈరోజు సమాజం లో ఈ విధంగా ఉంటున్నామని అన్నారు, నిరుపేద కుటుంబంలో ఉండిన విద్యను అభ్యసించి ఒక రాజకీయ నాయకుడిగా, ఆర్థికవేత్తగా, ఎదిగాడని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జెడి రంగ లక్ష్మి, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు,వివిధ కులాల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్



- ముప్పసాని సుధాకర్

**కర్నూల్ ఏప్రిల్ 14 (మనం న్యూస్):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాలకు చేసిన సేవలు మరువలేనివని అంతేగాక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రపంచ మేధావి అని ఆయన దళితులకు చేసిన మేలు ఎన్నో అని ప్రజా అధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి ముప్పసాని సుధాకర్ కొనియాడారు. సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134 జయంతి వేడుకలు పంచలింగాలలోని ఆయన విగ్రహం ముందర ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రజా అధికార పార్టీ నాయకులు సిద్దు రవికుమార్ నవీన్ సామెల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా అధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి ముప్పసాని సుధాకర్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రపంచ మేధావి అని బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని అంటరానితనం కుల వివక్షత పై పెరిగిన పోరాటం యోధుడు అని కొనియాడారు. ప్రతి సమస్యకు పరిష్కారం చేయడానికి ఎల్లప్పుడూ మీకు అందుబాటులో ఉంటామని తెలిపారు.

## రాజ్యాంగాన్ని దుర్వినియోగం చేయకండి



- వేల్పులగోపాల్ జాంబవ

**కర్నూలు ఏప్రిల్ 14మనం న్యూస్ఫ** కర్నూలు జిల్లా పాణ్యం అసెంబ్లీ కల్లూరు అర్బన్ -1 పరిధిలోని శ్రీశ్రీశ్రీ మాతమారెమ్మ దేవాలయం సర్కిల్ దగ్గర డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా పూలమాల వేసిన అనంతరం ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షుడు పాములకుమార్ శాలువతో సత్కరించిన ఈకార్యక్రమంలో వేల్పులగోపాల్ జాంబవ మాట్లాడుతూ రాజ్యాంగంలో వున్నటువంటి విషయాలను యావత్ సమాజం పాటించాలని వెనుక బడిన వర్గాల అభ్యున్నతికి పాటుపడాలి మోస పూరిత వ్యవహారాలు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి నిధులు తప్పు ధోవ పట్టకుండా ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలన్నారు గీతమాధురి జి యస్ నాగరాజు యాదవ్ తారకేశ్వర్ రెడ్డి మోహన్ రావు మాజీ మండల అధ్యక్షులు యం గంగాధర్ మండలాధ్యక్షులు యన్ రామాంజనేయులు మండల ప్రధానకార్యదర్శి చిరంజీవి శ్రీశ్రీశ్రీ మాత మారెమ్మ దేవాలయం పెద్దలు మీసాలవెంకటేశ్వర్లు లింగన్న దాసు శ్రీరాములు అశోక్ తదితరులు పాల్గొన్నారు అనంతరం సాయంత్రం బాబు జగ్ జీవన్ రామ్ సర్కిల్ నుండి రాజ్ విహార్ సర్కిల్ వరకు బారి ర్యాలి నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## మతోన్మాద వ్యతిరేక పోరాటమే జార్జిరెడ్డికి నిజమైన నివాళి

- కామ్రేడ్ జార్జిరెడ్డి 53వ వర్ధంతి సభ
- పీ డీ ఎస్ యూ రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్



**కర్నూలు ఏప్రిల్ 14మనం న్యూస్:** మతోన్మాద వ్యతిరేక పోరాటమే జార్జిరెడ్డికి నిజమైన నివాళి అని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీ డీ ఎస్ యూ) రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్ పిలుపునిచ్చారు. కర్నూల్ పట్టణంలో కామ్రేడ్ జార్జిరెడ్డి 53వ వర్ధంతి సభ నిర్వహించడం జరిగింది. అనంతరం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సభకు జిల్లా ఉపాధ్యక్షుడు రమణ అధ్యక్షత వహించగా ముఖ్య వక్తగా విచ్చేసిన పీ డీ ఎస్ యూ రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర బాబు మాట్లాడుతూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నిర్మాత ఉస్మానియా అరుణతార కామ్రేడ్ జార్జిరెడ్డి అని అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సాధారణ విద్యార్థిగా వచ్చి, అక్కడ జరుగుతున్న దౌర్జన్యాలకు ఎదురునిలిచి విద్యార్థులందరికీ అండగా నిలిచిన జార్జిరెడ్డి నేటి విద్యార్థిలోకానికి దిక్సూచి అని అన్నారు. విద్యార్థి ఉద్యమంలో ప్రగతిశీల ఆలోచనలతో, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం గళం ఎత్తి, వారితో మమేకమై ఉస్మానియా విశ్వవిద్యాలయ కేంద్రంగా విద్యారంగ సమస్యలపై, విద్యార్థి హక్కులకై, విద్యార్థులపై చేస్తున్న మూకదాడులపై తిరుగుబాటు చేసిన విద్యార్థి నాయకుడు కామ్రేడ్ జార్జిరెడ్డి అని, జార్జిరెడ్డి ఏ మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాడో వారే నేడు పాలకులుగా మారి దేశంలో అరాచక పాలన చేస్తూ, దేశాన్ని విధ్వంసం చేసే విధంగా సంస్కరణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. దేశంలోని విద్యారంగాన్ని విధ్వంసం చేయడానికి నూతన జాతీయ విద్యా విధానం 2020 ని తీసుకొచ్చారనీ, దేశంలో మోడీషా సాగిస్తున్న అరాచక పాలనకు వ్యతిరేకంగా విద్యార్థి లోకం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తకే ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు హామీలు ఇచ్చి నేడు హామీల అమలు చేయడంలో విఫలం చెందిందని అన్నారు. యువ గళం పాదయాత్రలో పీజీ విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ దూరం చేసే జీవో నెంబర్ 77 రద్దు చేస్తా అని చెప్పి నేడు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న 3600 కోట్ల ఫీజులు బకాయిలను విడుదల చేయాలి. తల్లికి వందనం పథకం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై పోరాటాలు కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు దామోదర్, పీవైఎల్ నాయకుడు ఇమామ్ భాష, సురేష్ , రాజు, తేజ, మధు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్నికైన దేవేంద్ర గౌడ్



**కర్నూలు, ఏప్రిల్ 14మనం న్యూస్:** జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్నికైన ఈ దేవేంద్ర గౌడ్ ను కలిసి అభినందనలు తెలియజేసిన రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ కె రామకృష్ణ. కర్నూలు జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన ఈ దేవేంద్ర గౌడ్ ను సన్మానించి అభినందనలు తెలియజేసిన రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్లు కే రామకృష్ణ మరియు వెంకటరాముడు లు ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలని జిల్లా అధ్యక్షులు ఎన్నికైన దేవేంద్ర గౌడ్ తెలియజేశారు.

## ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**కర్నూలు ఏప్రిల్ 14మనం న్యూస్:** కర్నూలు నగరంలో ఉన్న సంఘసంస్కర్త మరియు భారత రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా రిపబ్లికన్ విద్యార్థి సమైక్య జిల్లా కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ రిపబ్లికన్ విద్యార్థి సమైక్య ఏర్పడడానికి ముఖ్య కారణం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్.రిపబ్లికన్ విద్యార్థి సమాఖ్య 1957లో డాక్టర్ అ.ఖ అంబేద్కర్ సలహాతో వ్యవస్థాపక చైర్మన్ బార్ రాజాభౌ ఖోబ్రగాడే స్థాపించారు, స్వాతంత్ర్యం తర్వాత భారతీయ విద్యార్థులు చదువుకోవడానికి మరియు ఎలా చదువుకోవాలనే సమస్యను ఎదుర్కొంటున్నారు, అందుకే సంబంధిత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ నిరుపేద విద్యార్థులకు సహాయం చేయడానికి అవసరమైన ఖఖీఊ ను రాజాభౌ బిల్ చేశారు, స్కాలర్షిప్ సమస్య వంటి సమస్యలను పరిష్కరించడానికి దేశ వ్యాప్తంగా ఖఖీఊ కమిటీ సభ్యులతో సహాయం అందించడం ప్రారంభించారు, స్వాతంత్ర్యం ప్రారంభంలో బాలికల విద్యను నిర్వహించడం నిషిద్ధం, అందుకే వారు మరియు వారి బృందం పాఠశాల మరియు కళాశాలలో రిజర్వేషన్ల ఇవ్వడం ద్వారా మరింత ప్రేరేపించడం మరియు ఒప్పించడం ప్రారంభించారు,ఈ కార్యక్రమంలో ఖఖీఊ నాయకులు రవి, ప్రవీణ్ , ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


# మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందిస్తాం

- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్



**కర్నూలు, ఏప్రిల్ 14మనం న్యూస్:** ప్రతి ఇంటి నుండి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్న సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచన విధానానికి అనుగుణంగా పనిచేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. కర్నూల్లోని మౌర్య ఇన్లో కాన్ఫిడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంట్రెప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా, ఆంధ్ర ప్రదేశ్ చాప్టర్ (కోవె), ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ సంయుక్త ఆధ్వర్యంలో పౌష్టిక్ పేరుతో చిరుధాన్యాలతో కేక్స్ , బిస్కట్స్ తయారీ పై జరిగిన మూడు నెలల శిక్షణా శిభిరం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి టి.జి భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలు మిల్లెట్స్ తో తయారుచేసిన కేక్, పీజా, ఇతర వంటకాలను పరిశీలించారు. అనంతరం శిక్షణ ముగించుకున్న మహిళలకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ మహిళలకు సొంతంగా ఆదాయం సంపాదించేందుకు మిల్లెట్స్తో వంటకాలు తయారుచేసేందుకు శిక్షణ ఇచ్చిన నిర్వాహకులకు అభినందనలు తెలుపుతున్నట్లు మంత్రి చెప్పారు. మహిళలు సొంతంగా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఏదైనా ప్రాజెక్టు తయారుచేసుకొని ముందుకొస్తే తమ ప్రభుత్వం తరుపున, తమ టిజివి సంస్థల తరుపున ప్రోత్సాహం అందిస్తామన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు పారిశ్రామికవాడలో ల్యాండ్ అందుబాటులో ఉందని.. డిపిఆర్ తయారుచేసి ఇస్తే ఫుడ్ ప్రాసెసింగ్ కోసం ల్యాండ్ ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. మహిళలు ఆర్థికంగా స్థిరపడాల్సిన అవసరం ఉందన్నారు. కర్నూలు నగరంలో చాలా మంది మహిళలు ఇప్పటికీ బీడీలు తయారుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. మిల్లెట్స్ వంటకాలను తయారుచేస్తూ సంపాదించేలా స్థానిక మహిళలకు శిక్షణ ఇచ్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అనంతరం మిల్లెట్స్ వంటకాల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ శిలాయ్ జాకీ, కోవె నేషనల్ డైరెక్టర్ సుమన్ కుమార్, కోవే ఇండియా నేషనల్ సెక్రటరీ అపర్ణ, జాయింట్ సెక్రెటరి రాధిక చౌదరి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ కర్నూలు అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబెడ్కర్ ఆశయాలతో ప్రతి ఒక్కరు నడవాలి




- ఎమ్మిగనూరు లో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు
- అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన టీడీపి నాయకులు.

**ఎమ్మిగనూరు, ఏప్రిల్ 14మనం న్యూస్:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు ఎమ్మిగనూరు శాసనసభ్యులు డాక్టర్ బీవీ. జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు నియోజకవర్గ టీడీపి నాయకులు ఘనంగా నిర్వహించారు. సోమవారం అంబేద్కర్ సర్కిల్ లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టీడీపి శ్రేణులు మాట్లాడుతూ అంబేద్కర్ న్యాయవాదిగా, ఆర్థిక వేత్తగా, రాజకీయ వేత్తగా, అన్నింటికి మించి సామాజిక సంస్కర్తగా ఆయన చేసిన సేవలు కొనియాడారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ బాటలో నడవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పార్టీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## నేటి విద్యార్థులకు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ స్ఫూర్తి

- విద్య అకాడమిలో ఘనంగా అంబేద్కర్134వ జయంతి ఉత్సవాలు

**కర్నూలు ఏప్రిల్ 14(మనం న్యూస్):** పూలే, అంబేద్కర్ జయంతి వారోత్సవాలలో భాగంగా కర్నూలులోని బిర్లా కాంపౌండ్ నందు ఉన్న విద్య అకాడమీలో అంబేద్కర్ కు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగార్జున యూనివర్శిటీ రీసెర్చ్ స్కాలర్, బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ బాబు హాజరై మాట్లాడుతూ నేటి విద్యార్థులకు అంబేద్కర్ స్ఫూర్తి అని, మనిషి యొక్క విలువను చదువు పెంచుతుందని తెలిపారు. నేటి విద్యార్థులు చదువుతో పాటుగా సామాజిక స్పృహను కలిగి ఉండాలని అప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటామని తెలిపారు. పూలే అంబేడ్కర్ స్ఫూర్తితో సమ సమాజ స్థాపన కోసం యువత కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విద్యార్థి జేఏసీ చైర్మన్ కోనేటి వెంకటేశ్వర్లు, విద్య అకాడమి డైరెక్టర్ కె వెంకటేశ్వరమ్మ, రోపా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్ చంద్రమోహన్ పాల్గొన్నారు.



## ఆటో బోల్తా ఆరుగురికి తీవ్ర గాయాలు

**శంకరపట్నం (ఏప్రిల్ 14) మనం న్యూస్:** శంకరపట్నం మండలం ఆముదాలపల్లి గ్రామ శివారులో అదుపుతప్పి ప్యాసింజర్ ఆటో బోల్తా పడిన ఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాజాపూర్ గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన వ్యవసాయ కూలీలు ఓ ప్యాసింజర్ ఆటోలో వీణవంక మండలం కాపులపల్లి గ్రామంలో కూలీ పనులకు వెళ్లారు. కూలీ పనులు ముగించుకొని తిరిగి ఆటోలో



రాజాపూర్ వస్తుండగా ఆముదాలపల్లి వంతెన వద్దకు చేరుకోగానే ఆటో అదుపుతప్పి వందన కిందకి దూసుకెళ్లి బోల్తా పడింది. ప్రమాదంలో ఆటో నడుపుతున్న కనకం అంజయ్యతో పాటు కుక్కముడి వీరయ్య, ఎల్లమ్మ, మధురమ, శంకరమ్మ, సారమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనాల్లో క్షతగాత్రులను చికిత్స కోసం జమ్మికుంట, హుజురాబాద్ ఆస్పత్రికి తరలించారు.

## గరీబ్నగర్కు డాక్టర్ ఇస్మాయిల్ పేరు పెడతాం



- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్

**కర్నూలు, ఏప్రిల్ 14మనం న్యూస్:** పేద ప్రజలకు మంచి చేయాలన్నది దివంగత డాక్టర్ ఇస్మాయిల్ ఆలోచనా విధానమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. డాక్టర్ ఇస్మాయిల్ వర్ధంతి సందర్భంగా కొత్తపేటలోని ఆయన సమాధి వద్ద మంత్రి టి.జి భరత్ నివాళులర్పించారు. అనంతరం టి.జి భరత్ మాట్లాడుతూ రూ.2కే వైద్యం చేస్తూ పేదల డాక్టర్గా ఆయన పేరు పొందారన్నారు. దేశ వ్యాప్తంగా డాక్టర్ ఇస్మాయిల్కు మంచి పేరు ఉందన్నారు. అందుకే ఆయన పేరు చిరస్థాయిలో నిలిచిపోయేలా నగరంలోని గరీబ్ నగర్కు డాక్టర్ ఇస్మాయిల్ పేరు పెట్టేందుకు ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. పేదలకు సేవ చేయాలన్న ఆయన ఆలోచనా విధానం అందరికీ స్ఫూర్తి అవ్వాలన్నారు. తన తండ్రి టి.జి వెంకటేష్ కు, డాక్టర్ ఇస్మాయిల్తో ఎంతో మంచి అనుబంధం ఉందన్నారు. ఎవ్వరిని అడిగినా వీరిద్దరినీ రామ్, రహీమ్ అని పిలిచేవారని మంత్రి టి.జి భరత్ చెప్పారు. మంత్రి టి.జి భరత్ వెంట ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**బేతంచేర్ల, ఏప్రిల్ 14(మనంన్యూస్):** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు బిజెపి పార్టీ రాష్ట్ర ఆదేశాల మేరకు జిల్లా సూచన మేరకు అసెంబ్లీ కన్వీనర్ సలహాతో బేతంచెర్ల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు ఆంజనేయులు టౌన్ అధ్యక్షుడు అశ్వర్థ నారాయణ ఆధ్వర్యంలో పట్టణం లో పాత బస్టాండ్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా ఏవెళ్లి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు కార్యక్రమం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు నాగ మోహన్ రెడ్డి అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే అంబేద్కర్ కు మనం అర్పించే నివాళి అని తెలియజేశారు భారత రాజ్యాంగం ఉన్నంతవరకు అంబేద్కర్ పేరు ప్రఖ్యాతలు ఉంటుంది వారు ఒక కులానికి ఒక ప్రాంతానికి చెందినవారు కారు అన్ని కుల మతాలకు అతీతంగా సమాజ శ్రేయస్సు కోసం పాటుపడిన మహోన్నతమైన వ్యక్తి అని తెలియజేశారుఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చంద్ర నాగేశ్వరప్ప వెంకటకృష్ణ కార్యదర్శులు కౌశిక్ మణికంఠ ప్రధాన కార్యదర్శులు లక్ష్మీనారాయణ కిసాన్ మోర్చా అధ్యక్షుడు బండికారి మద్దిలేటి స్వామి యువ మోర్చా అధ్యక్షుడు ధర్మారెడ్డి చంద్రమోహన్ కార్యదర్శి టైలర్ రాముడు సభ్యులు శ్రీనివాసులు సుధాకర్ ఎల్ఐసి శ్రీనివాస్ వెంకట కృష్ణ మల్లికార్జున సుధీర్ రమణ రామస్వామి బలపాపల్లి సుబ్రహ్మణ్యం గౌరీ భరత్ కుమార్ రెడ్డి నాగేశ్వరప్ప బిజెపి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

# రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా 135 యూనిట్ల రక్త సేకరణ

- అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన రక్తదాన సేకరణ కార్యక్రమంలో సాధించిన ఘనత
- రక్తదానానికి యువత ముందుకు రావడం అభినందనీయం
- జిల్లా అడిషనల్ కలెక్టర్ చందర్ నాయక్



**కామారెడ్డి, ఏప్రిల్ 14 (మనం ప్రతినిధి):** కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల కేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ 135 వ జయంతిని పురస్కరించుకొని తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం కామారెడ్డి రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్),అంబేద్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో మొట్టమొదటిసారిగా రాష్ట్ర చరిత్రలో అంబేద్కర్ జయంతి సందర్భంగా 135 యూనిట్ల రక్తాన్ని సేకరించి ఆదర్శంగా నిలవడం జరిగిందని కామారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ చందర్ నాయక్ తెలియజేశారు. రక్తదానం చేసిన రక్తదాతలకు ప్రశంస పత్రాలను అందజేసి అభినందించడం జరిగింది.రక్తానికి ప్రత్యామ్నాయ మార్గాలు లేవని మానవతా దృక్పథంతో రక్తదానానికి ముందుకు వచ్చిన రక్త దాతలకు,ఈ శిబిరం విజయవంతం చేయడానికి సహకరించిన డాక్టర్ బాలు, జమీల్ హైమాద్, శివాజీ లకు తలసేమియా పురస్కారాలను అందజేసి సన్మానించడం జరిగింది. ఈ శిబిరంలో పాల్గొని రక్తదాతలను అభినందించడమే కాకుండా రక్తదానం చేసిన ఎంఈఓ రామస్వామి,ఎస్ట్స్ వెంకటేశ్వర్లు ఎల్లారెడ్డి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నిజాం,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కపిల్ రెడ్డి లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు, కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు జమీల్ లు మాట్లాడుతూ., రాష్ట్ర చరిత్రలోనే ఒక మండలంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా 135 యూనిట్ల రక్తాన్ని ఇప్పటివరకు ఎక్కడ సేకరించడం జరగలేదని అలాంటి గొప్ప సేవా కార్యక్రమానికి ముందుకు వచ్చి రక్తదానం చేసిన వారందరికీ,జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన అంబేద్కర్ యువజన సంఘాల ప్రతినిధులకు అభినందనలు తెలియజేశారు. ఈ రక్తదాన శిబిరానికి జ్యూస్ బాటిల్లను, వాటర్ బాటిల్ లను అందజేసిన ముస్త్యాల రమేష్ మరియు ఐవిఎఫ్ కల్చరల్ విభాగం డివిజన్ చైర్మన్ వందనపు శైలేందర్, ఏంఎన్సి డిప్యూటీ మేనేజర్ చింతల సరిత కు ప్రత్యేక కృతజ్ఞతలు నిర్వాహకులు తెలియజేశారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం నాలుగు వేల యూనిట్లకు పైగా రక్తాన్ని సేకరించడం జరిగిందని, భారతదేశంలోనే తలసేమియా చిన్నారులకు అత్యధిక యూనిట్ల రక్తాన్ని సేకరించిన ఘనత కూడా కామారెడ్డి జిల్లాకి దక్కిందని దీనికి గాను ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో కూడా చోటు దక్కించుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు, కామారెడ్డి రక్తదాతల సమూహ గౌరవ అధ్యక్షులు డాక్టర్ వేదప్రకాష్, అధ్యక్షులు జమీల్,ఉపాధ్యక్షులు వెంకటరమణ, ఎర్రం చంద్రశేఖర్, ఎస్సీ సెల్ ఎల్లారెడ్డి నియోజకవర్గ అధ్యక్షులు గైని శివాజీ, మాజీ సర్పంచ్ సంజీవులు,మాజీ ఏఎంసీ చైర్మన్ శ్యామ్ రావు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మద్దెల బాగయ్య,ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు అధ్యక్షులు కొంగల వెంకటి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మండల చైర్మన్ నల్లవెల్లి కపిల్ రెడ్డి, సేవాదళ్ సంఘ జిల్లా అధ్యక్షుడు లింగాగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, యూత్ సభ్యులు చిరంజీవి, మహిపాల్, సంతోష్, సంజీవులు, సురేష్, రవి, టీఎన్ జీవో జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్ రెడ్డి, టీపిటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లింగం, డిటిఎఫ్ అధ్యక్షులు ప్రభాకర్,కార్యదర్శి దేవ్లా జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ మండలాల అంబేద్కర్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు ఘన నివాళి

- తెలంగాణ జాగృతి జిల్లా కన్వీనర్ అవంతి కుమార్

**నిజామాబాద్, ఏప్రిల్ 14(మనం న్యూస్):** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా తెలంగాణ జాగృతి నిజామాబాద్ జిల్లా ఆధ్వర్యంలో నగరంలోని పులాంగ్ చౌరస్తా లోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి తెలంగాణ జాగృతి నాయకులు నివాళులర్పించారు.ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి నాయకులు అవంతి కుమార్ మాట్లాడుతూ..బాబాసాహెబ్ అంబేద్కర్ గా ప్రసిద్ధి చెందిన బిఆర్ అంబేద్కర్ ఒక ఆర్థికవేత్త, రాజకీయవేత్త మరియు సామాజిక సంస్కర్త, ఆ కాలంలో అంటరానివారిగా పరిగణించబడే దళిత సమాజం యొక్క హక్కుల కోసం పోరాడారు.భారత రాజ్యాంగ నిర్మాత అయిన అంబేద్కర్ మహిళల హక్కులు మరియు కార్మికుల హక్కుల కోసం కూడా



వాదించారు.స్వతంత్ర భారతదేశపు తొలి న్యాయ, న్యాయ మంత్రిగా గుర్తింపు పొందిన అంబేద్కర్, భారత గణతంత్ర భావనను నిర్మించడంలో చేసిన కృషి అపారమైందన్నారు. డాక్టర్ అంబేద్కర్ కుల వివక్షకు వ్యతిరేకంగా అవిశ్రాంతంగా పోరాడారు మరియు స్వేచ్ఛ, సమానత్వం మరియు సోదరభావం ఆధారంగా సమాజాన్ని సృష్టించడానికి కృషి చేశారు. అణగారిన వర్గాల అభ్యున్నతిలో ఆయన ప్రయత్నాలు కీలక పాత్ర పోషించాయి. అంబేద్కర్ జయంతి కేవలం ఒక చారిత్రక వ్యక్తి జ్ఞాపకార్థం కాదు ఆయన నిలబెట్టిన విలువలను - విద్య, సాధికారత మరియు సామాజిక సామరస్యాన్ని - నిలబెట్టడానికి ఇది ఒక జ్ఞాపకం అని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి నాయకులు లక్ష్మీనారాయణ భరద్వాజ్ , జైపాల్ , సాయికృష్ణ , మహిళా నాయకులు రేఖ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సన్నబియ్యం పేదింటి కుటుంబానికి వరం

- బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్



**భీంగల్ ,ఏప్రిల్ 14(మనం న్యూస్):** తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఉగాది నుండి అమలుపరుస్తున్న సన్న బియ్యం పంపిణీ పేద కుటుంబాలకు వరంగా మారిందని బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ తెలిపారు. సోమవారం భీంగల్ మండలం మెండోర గ్రామంలో సన్న బియ్యం లబ్ధిదారులైన పందిరి విజయలక్ష్మి- బాలకిషన్ ఆహ్వానం మేరకు వారి ఇంటికి వెళ్లి రేషన్ బియ్యంతో వండిన భోజనాన్ని గ్రామస్తులతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే మొట్టమొదటిసారిగా పేదల ఇంట్లో ప్రతిరోజు పండగ ఉండాలన్న ఉద్దేశంతో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని తెలిపారు. పేదలు కడుపునిండా తిని వారి కళ్ళలో వెలుగులు చూడాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి సాహసోపేతంగా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని తీసుకొని పేద ప్రజలందరి ఆకలి తీరుస్తున్నారని అన్నారు. ప్రతిపక్ష నాయకులు బియ్యం కాదు నూకలు పంపిణీ చేస్తున్నారని అసత్య ఆరోపణలు చేస్తున్నారని వారి ఆరోపణలు అర్థరహితమని అన్నారు. మేలైన మంచి బియ్యాన్ని రేషన్ షాపులలో పంపిణీ చేస్తున్నామని ప్రజలందరికీ సన్న బియ్యం అందుతున్నాయని రేషన్ బియ్యం తోనే వంటలు చేసుకొని తింటున్నారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులకు ఏమైనా అనుమానం ఉంటే బాల్కొండ నియోజకవర్గంలోని ఏ గ్రామంలోకైనా రావాలని ఏ లబ్ధిదారుడి ఇంటికైనా వెళ్లి వారి ఇంట్లో అన్నం ఏ విధంగా ఉందో చూద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కమిషనర్ సొంత పైసలు ఖర్చు పెడుతున్నారా?

- మున్సిపల్ కమిషనర్ పై విమర్శల వెల్లువ
- రాజ్యాంగ నిర్మాతను గౌరవించుకోవడం అందరి బాధ్యత
- మున్సిపల్ కమిషనర్ పై మాజీ చైర్మన్ ఆనంపల్లి ఎల్లయ్య ఆగ్రహం

**బోధన్, ఏప్రిల్ 14(మనం న్యూస్):** అంబేద్కర్ జయంతిని అధికారికంగా జరపాలని అదేశాలు ఉన్నా.. మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేయకపోవడం శోచనీయం అని బోధన్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంపల్లి ఎల్లయ్య అన్నారు.సోమవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో విగ్రహానికి నివాళులు అర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అధికారుల సొంత డబ్బులు ఖర్చు పెట్టమని తాము అడగటం లేదని అన్నారు. గతంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా అధికారికంగా ఏర్పాట్లు చేసేవారని అన్నారు. అంబేద్కర్



జయంతిని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఉన్నప్పటికీ మున్సిపల్ కమిషనర్ కలెక్టర్ ఆదేశాలను సైతం బేఖాతర్ చేయడం కమిషనర్ నిర్లక్ష్యానికి నిదర్శనం అని అన్నారు. అంబేద్కర్ విగ్రహానికి వేసిన పూలమాలనే తిరిగి వేయటం అంబేద్కర్ ని అవమానించటమే అవుతుందని అన్నారు. కనీసం మంచి నీరు, టెంట్లు, కుర్చీలు కూడా వేయలేని దుస్థితిలో మున్సిపల్ అధికారులు ఉన్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ తన తీరు మార్చుకోవాలని తన సొంత డబ్బులు ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదని ప్రభుత్వం అంబేద్కర్ జయంతికి నిధులు వెచ్చిస్తుందని ఆయన అన్నారు.

# జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు..




**కామారెడ్డి, ఏప్రిల్ 14 ( మనం ప్రతినిధి):** అంబేద్కర్, డా. బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం కామారెడ్డి జిల్లా ఎస్పి యం. రాజేష్ చంద్ర ఆదేశాల ప్రకారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అంబేద్కర్ ఫోటోకు పూలమాల వేసి జిల్లా అదనపు ఎస్పి కె. నరసింహ రెడ్డి, కామారెడ్డి ఏఎస్పి బి. చైతన్య రెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏఎస్పి కె నరసింహ రెడ్డి మాట్లాడుతూ., డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారత రత్న, ప్రముఖ భారతీయ న్యాయవాది, ఆర్థిక శాస్త్రవేత్త, సంఘ సంస్కర్త, అంటరానితనం నిర్మూలనకు కృషి చేసిన మహనీయుడు, స్వతంత్ర భారతదేశపు మొట్టమొదటి కేంద్ర న్యాయశాఖ మంత్రి, రాజ్యాంగ శిల్పి, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన అవిశ్రాంత కృషి మరియు సమ్మిళిత సమాజాన్ని నిర్మించడంలో ఆయన కృషి అందరికీ స్ఫూర్తిదాయకం అని, ఆ మహనీయులను స్మరిస్తూ మాతృదేశానికి మన వంతు సేవ చేయడమే వారికి మనం ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఏఎస్పి బి. చైతన్య రెడ్డి మాట్లాడుతూ., యువత అంబేద్కర్ జీవితం, బోధనల నుండి ప్రేరణ పొంది, రాజ్యాంగంలో పొందుపరచబడిన సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం యొక్క విలువలను నిలబెట్టడానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ తిరుపయ్య, ఇన్స్పెక్టర్ జార్జ్, ఆర్ఐ. కృష్ణ, ఆర్ఎస్ఐ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాతీయం- అంతర్జాతీయం

# వక్ఫ్ రూల్స్‌ను కాంగ్రెస్ తమ స్వార్థానికి మార్చేసింది: మోడీ

**ఛండీగఢ్, ఏప్రిల్ 14:** అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ పవిత్రమైన రాజ్యాంగాన్ని ఆయుధంలా వాడుకుంటోందని ప్రధాని నరేంద్రమోడీ ఆరోపించారు. వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ చేస్తున్న నిరసనలపై ప్రధాని నరేంద్ర మోడీ మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో వక్ఫ్ రూల్స్‌ను తమ స్వార్థానికి మార్చేసిందని



ఆరోపించారు. అధికారం కోసం పవిత్రమైన రాజ్యాంగాన్ని ఆయుధంలా వాడుకుంటూ.. ఓటు బ్యాంకు వైరస్‌ను వ్యాప్తి చేసిందని అన్నారు. ముస్లింలకు మద్దతుగా నిరసనలు చేపడుతున్న కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో ఎందుకు వారికి పార్టీలో ఉన్నత స్థానాలను ఇవ్వలేదని ప్రశ్నించారు. ముస్లిం అభ్యర్థులకు 50 శాతం ఎన్నికల టిక్కెట్లను ఎందుకు రిజర్వ్ చేయలేదని నిలదీశారు.

హరియాణాలోని హిస్సార్ విమానాశ్రయ ప్రారంభోత్సవంలో ప్రధాని మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో ఈ విమానాశ్రయం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్‌ను గుర్తుచేసుకుంటూ.. ఆయన పాటించిన విధానాలే తమ ప్రభుత్వానికి స్ఫూర్తినిస్తున్నాయన్నారు. కానీ.. దేశ ప్రజల కోసం ఆయన రూపొందించిన రాజ్యాంగాన్ని కాంగ్రెస్ అధికారం పొందేందుకు ఒక సాధనంగా వాడుకుంటోందని విమర్శించారు. ఇందిరాగాంధీ హయాంలో అత్యవసర పరిస్థితి విధించిన సమయంలో అధికారాన్ని నిలుపుకోవడానికి రాజ్యాంగ స్ఫూర్తిని హత్య చేశారని దుయ్యబట్టారు. రాజ్యాంగ విలువల గురించి ప్రసంగాలు చేసే ప్రతిపక్ష నాయకులు ఎప్పుడూ వాటిని పాటించలేదని అన్నారు.

పార్లమెంట్ ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ చట్టం, 2025 ఇటీవల అమల్లోకి వచ్చింది. కాగా కేంద్రం తీసుకొచ్చిన కొత్త వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని ముస్లిం సంఘాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై విపక్ష పార్టీల ఎంపీలు, ముస్లిం సంఘాల ప్రతినిధులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మొత్తం 15 పిటిషన్లు దాఖలు కాగా.. వీటిపై సర్వోన్నత న్యాయస్థానం ఏప్రిల్ 16న విచారణ జరపనుంది. మరోవైపు వక్ఫ్ సవరణల చట్టం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని, ఇది 14, 25, 26 ఆర్టికల్స్‌ను పూర్తిగా ఉల్లంఘించడమే అవుతుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. పలు రాష్ట్రాల్లో ముస్లింలు దీనికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపడుతున్నారు. పశ్చిమబెంగాల్లోని ముర్షిదాబాద్‌లో జరిగిన ఆందోళనల్లో ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. పరిస్థితులు అదుపుతప్పడంతో 110 మందికి పైగా ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# ఉక్రెయిన్కు వచ్చి ఏం జరుగుతోందో చూడండి.. ట్రంప్నకు జెలెన్స్కీ ఆహ్వానం

**కీవ్, ఏప్రిల్ 14:** రష్యా దాడి వల్ల జరిగిన వినాశనాన్ని కళ్లారా చూడాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను కోరారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగించడానికి ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ మాస్కో భారీగా దాడులకు పాల్పడుతోంది. ఆదివారం సుమీ నగరంపై బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించడం వల్ల 34 మంది మృతి చెందగా.. 117 మంది క్షతగాత్రులయ్యారు. ఈ ఘటనపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ మాట్లాడుతూ.. రష్యా చేసిన దాడి వల్ల జరిగిన వినాశనాన్ని ఇక్కడికి వచ్చి కళ్లారా చూడాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్‌ను కోరారు. ఈ పర్యటనతో అయినా పుతిన్ చేస్తున్న విధ్వంసాన్ని ఆయన అర్థం చేసుకొని.. ఎటువంటి వారితో ఒప్పందం చేసుకున్నారో తెలుసుకుంటారని అన్నారు.

''యుద్ధాన్ని ముగించాలని పుతిన్ ఎప్పుడూ కోరుకోలేదు. మా దేశాన్ని పూర్తిగా నాశనం చేయాలని చూస్తున్నాడు. అందుకే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి మాస్కో మాపై దాడులు చేస్తోంది. నేను పుతిన్‌ను నమ్మనని చాలాసార్లు అమెరికా అధ్యక్షుడితో చెప్పాను. రష్యా మారణ హోమంలో అనేకమంది చనిపోతున్నారు. దయచేసి ఏవైనా నిర్ణయాలు తీసుకొనే ముందు, చర్చలు చేపట్టేముందు వారిని చూడటానికి రండి.



దాడులు జరుగుతున్న ఏ నగరంలో అయినా మీరు పర్యటించవచ్చు'' అని జెలెన్స్కీ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

ఉక్రెయిన్ ప్రజలను హత్య చేస్తూ.. దేశంలో మారణకాండ సృష్టిస్తున్న పుతిన్ అంటే తనకు చెప్పలేనంత ద్వేషం ఉందని అన్నారు. అయితే ఈ శత్రుత్వం వల్ల యుద్ధాన్ని కొనసాగించడం సరైన చర్య కాదని పేర్కొన్నారు. న్యాయమైన శాంతిని సాధించడమంటే మన సార్వభౌమత్వాన్ని, స్వాతంత్ర్యాన్ని కోల్పోకుండా ఉండడమే అని అన్నారు. తమ నుంచి రష్యా లాక్కున్న భూభాగాలని తిరిగి పొందడానికి కృషి చేస్తానని జెలెన్స్కీ తెలిపారు.


ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఇందులోభాగంగా రష్యా, ఉక్రెయిన్ దేశాధినేతలతో చర్చలు జరిపిన అమెరికా అధ్యక్షుడు 30 రోజుల కాల్పుల విరమణను ప్రతిపాదించారు. అందుకు కీవ్ అంగీకరించగా.. మాస్కో సూత్రప్రాయంగా ఒప్పుకొంది. అయినప్పటికీ ఇరువర్గాలు దాడులను కొనసాగిస్తున్నాయి. వారం రోజుల్లో మాస్కో కీవ్‌పై భారీస్థాయిలో విరుచుకుపడింది. మట్టల ఆదివారం సందర్భంగా ఉక్రెయిన్ ప్రజలు పండగ చేసుకుంటున్న సమయంలో రష్యా క్షిపణి దాడులకు పాల్పడడంతో 20మంది మృతి చెందగా వందల సంఖ్యలో గాయాలపాలయ్యారు. ఈ దాడులను జెలెన్స్కీ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై ప్రపంచ దేశాలు స్పందించాలని డిమాండ్ చేశారు. రష్యాపై ఒత్తిడి లేకుండా.. శాంతిస్థాపన అసాధ్యమన్నారు. ఓ ఉగ్రవాదితో ఏవిధంగా వ్యవహరిస్తారో.. రష్యాపై అటువంటి వైఖరి అవసరమన్నారు.

# మోడీ ప్రభుత్వంలో అంబేద్కర్‌పై గౌరవం మాటలకే పరిమితం: మల్లిఖార్జున ఖర్గే

**ఢిల్లీ,ఏప్రిల్ 14:** బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లపై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

కేంద్రంలోని మోడీ సర్కార్, ఆర్ఎస్ఎస్‌లపై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆరోపణలు చేశారు. అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చే ఉద్దేశం నరేంద్రమోడీ ప్రభుత్వానికి ఎంత మాత్రం లేదని విమర్శించారు.బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు రాజ్యాంగ నిర్మాతకు శత్రువులని కీలక వ్యాఖ్యలు చేశారు.

''మోడీ ప్రభుత్వంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై గౌరవం మాటలకే పరిమితం.



ఆయన ఆశయాలను నెరవేర్చే ఉద్దేశం వారికి లేదు. ఆయన వారసత్వంపై పెదవి విరుస్తున్నారు. 1952 ఎన్నికల్లో అంబేద్కర్ ఓటమికి ఎస్ఏ డాంగే, వీడీ సావర్కర్లు కారణం. ఈ విషయాన్ని అంబేద్కర్ ఓ లేఖలో పేర్కొన్నారు'' అని ఖర్గే వ్యాఖ్యానించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా మీడియా సమావేశంలో పాల్గొన్న ఆయన ఎన్డీయే ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. దేశవ్యాప్తంగా కులగణన అవసరాన్ని ఖర్గే నొక్కి చెప్పారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లు అమలుచేయాలని అన్నారు. ''రాజ్యాంగం.. పౌరులకు అంబేద్కర్ ఇచ్చిన బహుమతి. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం పొందే హక్కును కల్పిస్తుంది. ఏఐసీసీ సమావేశంలో సామాజిక న్యాయానికి సంబంధించిన అభిప్రాయాలను ముందుకు తీసుకెళుతున్నాం. 2011 జనాభా లెక్కల ప్రకారం కేంద్రం విధానాలను రూపొందిస్తోంది. కానీ, 2021 జనాభా లెక్కల గురించి ఇంతవరకు జాడ లేదు. సాధారణ జనాభా లెక్కలతో పాటు ఏ విభాగంలో ఎంత పురోగతి సాధించామో తెలుసుకోవడానికి కులగణన ఉపయోగపడుతుంది. అందుకే కాంగ్రెస్ తన డిమాండ్ వినిపిస్తోంది'' అని అన్నారు.

# రూ.5-10 లక్షలకు పసిబిడ్డల విక్రయం..

- ఢిల్లీలో ముఠా అరెస్టు

**ఢిల్లీ, ఏప్రిల్ 14:** అప్పుడే పుట్టిన పసి బిడ్డలను ఢిల్లీ, ఇతర నగరాల్లో విక్రయిస్తున్న ముఠా సభ్యులను ఢిల్లీలోని ద్వారకా పోలీసులు అరెస్టు చేశారు. నవజాత శిశువులను అపహరించి.. ధనవంతులకు రూ.5-10 లక్షలకు విక్రయిస్తున్న ఓ ముఠాను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఇద్దరు మహిళలు సహా ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి నాలుగు రోజులున్న ఇద్దరు చిన్నారులను రక్షించినట్లు పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్, రాజస్థాన్, ఢిల్లీలోని పలు ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులే లక్ష్యంగా ఈ ముఠా కార్యకలాపాలు కొనసాగిస్తోంది. ఇప్పటివరకు దాదాపు 35 మంది చిన్నారులను విక్రయించింది. ఇటీవల ద్వారకా జిల్లాలోని ఉత్తమ్‌నగర్‌లో కొందరు వ్యక్తులు ఓ శిశువును విక్రయించడానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వారిని అదుపులోకి తీసుకోవడంతో ఈ ముఠా గుట్టు రట్టయ్యింది. అపహరించిన శిశువులను ఢిల్లీ చుట్టుపక్కల ఉన్న మురికివాడల్లో ఉంచి.. పిల్లలు లేని ధనవంతులకు రూ.5 నుంచి రూ.10 లక్షలకు విక్రయిస్తున్నారు. వారి నుంచి ఇద్దరు నవజాత శిశువులను కాపాడామని.. చిన్నారులు గుక్కపట్టి ఏడుస్తున్నా పట్టించుకోకుండా నిందితులు వారి విక్రయానికి ప్రయత్నించారని పోలీసులు తెలిపారు. మురికివాడల్లోనే కాకుండా దేశ రాజధానిలోని ధనవంతుల నివాస ప్రాంతాల్లో కూడా ఈ ముఠాకు విస్తృతమైన నెట్‌వర్క్ ఉందని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ రాకెట్లో కొందరు వైద్యుల సహకారం కూడా ఉండొచ్చని అనుమానిస్తున్నారు. శిశువులను ఎవరెవరికి విక్రయించారనే విషయాన్ని తెలుసుకోవడానికి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# ట్రంప్ హత్యకు డబ్బులివ్వలేదని.. తల్లిదండ్రులను కాల్చి చంపాడు..!

**విస్కాన్సిన్, ఏప్రిల్ 14:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను హత్య చేసేందుకు డబ్బులు సమకూర్చలేదని.. ఓ యువకుడు తల్లిదండ్రులనే చంపేశాడు. తల్లిదండ్రులను అతి దారుణంగా కాల్చి చంపిన కేసులో 17 ఏళ్ల యువకుడిని అమెరికా పోలీసులు గత నెల అరెస్టు చేశారు. ఆ కేసు దర్యాప్తులో తెలిసిన వాస్తవాలు చూసి అధికారులు ఉలిక్కిపడ్డారు. అధ్యక్షుడు ట్రంప్‌ను హత్య చేసేందుకు కుట్ర పన్నిన ఆ యువకుడు.. అందుకు డబ్బులు ఇవ్వట్లేదనే కారణంతోనే ఈ దారుణానికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. ఈ మేరకు ఫెడరల్ వారెంట్‌లో పేర్కొన్నారు. విస్కాన్సిన్‌లోని మిల్వాకీ ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల నికిటా క్యాసప్.. ఈ ఏడాది ఫిబ్రవరి 11న తన తల్లి టటియానా, సవతి తండ్రి డొనాల్ మేయర్‌ను తమ నివాసంలోనే అతి దారుణంగా తుపాకీతో కాల్చి చంపాడు. అనంతరం కొన్ని వారాల పాటు మృతదేహాల పక్కనే నివసించాడు. ఆ తర్వాత 14వేల డాలర్ల నగదు, పాస్‌పోర్ట్ ఇతర వస్తువులు తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతడి ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకోగా హత్య విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో గత నెల కాన్సస్‌లో నిందితుడు నికిటాను పోలీసులు అరెస్టు చేశారు. దర్యాప్తులో అతడి గురించి సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆర్థిక



అవసరాలు, స్వేచ్ఛ కోసమే అతడు తల్లిదండ్రులను చంపినట్లు తెలిసింది. అంతేకాదు.. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను చంపేందుకు అతడు కుట్ర పన్నినట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. ఈ కుట్ర గురించి తల్లిదండ్రులకు తెలియడంతోనే వారిని నిందితుడు హత్య చేసినట్లు తెలిసింది. వారిని చంపేసిన తర్వాత ఆ యువకుడు ఓ డ్రోన్, ఇతర పేలుడు పదార్థాలను కొనుగోలు చేశాడు. ఓ రష్యా వ్యక్తితో కలిసి ఈ ప్లాన్ వేసినట్లు సమాచారం. టిక్‌టాక్, టెలిగ్రామ్ వంటి సోషల్‌మీడియా యాప్‌లలో ఇతడు సంభాషణలు జరిపినట్లు పోలీసులు గుర్తించారు. డోనాల్డ్ ట్రంప్‌ను చంపి ఉక్రెయిన్ పారిపోవాలని అతడు ప్రణాళిక వేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం దీనిపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

# డా.బి.ఆర్.అంబేద్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

● జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



కర్నూలు, ఏప్రిల్ (మనం న్యూస్): డా.బి.ఆర్.అంబేద్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా విద్యార్థులకు సూచించారు. సోమవారం వెల్దుర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ బాలుర వసతి గృహంలో భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని వారి చిత్రపటానికి పూలమాలవేసి కలెక్టర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురించి విద్యార్థులకు వివరించారు.. ఈరోజు భారతదేశమంతా అలాగే ప్రపంచవ్యాప్తంగా కూడా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జన్మదిన వేడుకలను జరుపుకుంటున్నామన్నారు.... 1891లో అంటే దాదాపు 133 ఏళ్ల కిందట ఏప్రిల్ 14 వ తేదీన సుబేదార్ రాంజీ సక్పాల్ మరియు బీమ్ భాయ్ దంపతులకు 14వ సంతానంగా జన్మించడం జరిగిందన్నారు...ఆ కాలంలో అస్పృశ్యత, అంటరానితనం ఎక్కువగా ఉండేదన్నారు. అంబేద్కర్ స్కూల్ లో చదివే రోజుల్లోనే సామాజిక వివక్ష ను ఎదుర్కొన్నారన్నారు..అంబేద్కర్ జీవితంలో చిన్నతనంలో ఉన్న కష్టాలు అధిగమిస్తూ, విద్యను అభ్యసించే సమయంలో ఎదుర్కొన్న పరిస్థితుల వల్ల ప్రశ్నించే దృక్పథాన్ని అలవాటు చేసుకున్నారన్నారు. ఆయన బరోడా మహారాజు ఉపకార వేతనంతో డిగ్రీను పూర్తి చేశారన్నారు... ఆయనకు ఆ సంస్థానంలో అక్కడే జాబ్ వచ్చిందని, కానీ ఆ జాబ్ ను వదిలేసి ఇంకా బాగా చదవాలని, మహారాజు సహకారంతోనే ఆయన పై చదువులకు వెళ్లడం జరిగిందన్నారు. లా, పీహెచ్డీ కంప్లీట్ చేశారన్నారు... 1915-16 లో అంటరానితనం ఉన్న పరిస్థితుల్లో లండన్ కొలంబియా విశ్వవిద్యాలయంకు వెళ్లి విదేశాల్లో చదివి మరల తిరిగి వచ్చి సమాజంలో ఉన్న అస్పృశ్యత, అంటరానితనం లను రూపుమాపాలని, అందరూ సమానంగా ఉండాలి అనే నినాదంతో పోరాటం మొదలుపెట్టారన్నారు..చదువు, న్యాయవాద వృత్తి,రాజకీయాలు ఈ మూడింటి లోనూ ఆయన అగ్రగామిగా ఉన్నారన్నారు.. భారతదేశం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా మొట్టమొదటి కేంద్ర న్యాయశాఖ మంత్రి గా పని చేయడం జరిగిందన్నారు.. ప్రతి మతానికి ఒక పవిత్ర గ్రంథం ఉంటుందనీ, భారతీయులందరికీ కూడా పవిత్రమైన గ్రంథం ఏంటంటే అది భారత రాజ్యాంగం అన్నారు.. భారత రాజ్యాంగాన్ని అంబేద్కర్ గ కష్టపడి మనందరికీ అందించడం జరిగిందన్నారు... ఇన్ని సంవత్సరాలు తర్వాత కూడా రాజ్యాంగంపై దేశమంతా కట్టుబడి ఉందంటే ఆయన ఎంత విజనరీ గా రాశారో అర్థమవుతుందన్నారు.. ఈరోజు అనుభవిస్తున్న సమాన అవకాశాలు ఆయన రాజ్యాంగంలో పొందుపరచడం వల్లే సాధ్యమయ్యాయన్నారు.. విద్యార్థి దశ నుంచి చివరి దశ వరకు ప్రతి మనిషికి ఒక ఆదర్శంగా ఆయన జీవితం ఉంటుందన్నారు... అంబేద్కర్ గారిని ఆదర్శంగా తీసుకొని తాను కూడా ఇక్కడ కాల్వబుగ్గ స్కూల్ లో చదువుకొని ఈ స్థాయికి వచ్చానన్నారు.. అంబేద్కర్ ను ఆదర్శంగా పెట్టుకుని మీరందరూ కూడా ఉన్నత స్థాయికి వెళ్ళాలనీ, భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు సాగాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు... ఆయన స్ఫూర్తితో ఆయన ఆశయాలకు పునరంకితం కావాలన్నారు... రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, సాంఘిక సంక్షేమ వసతి గృహాల మరమతులకు 7 కోట్ల రూపాయలను, అదే విధంగా బీసీ సంక్షేమ వసతి గృహాల మరమతులకు కోటిన్నర రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు..ఈ ఈ నెల చివరి నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు.. కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్.బి.ఆర్ అంబేద్కర్ అంటేనే మనకు గుర్తుకు వచ్చేది మన భారత రాజ్యాంగం అన్నారు.. ఈ రాజ్యాంగాన్ని రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులలో రచించడం జరిగిందన్నారు. భారతదేశంలో ఉన్న ఎన్నో సమస్యల పైన పోరాడిన మహనీయుడు, బాల్య వివాహాలను నియంత్రించడానికి పోరాడిన గొప్ప నాయకుడని తెలిపారు.. అంబేద్కర్ సామాజిక ప్రజాస్వామ్య తత్వవేత్త, న్యాయ స్వేచ్ఛ, సమానత్వం, సమాజంలో అన్ని రంగాల్లో అందరికీ అందించాలని తపించిన గొప్ప మానవ మూర్తి అని ఆయన కొనియాడారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు కలెక్టర్ బహుమతి ప్రదానం చేశారు... అనంతరం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన వంట సామాగ్రిని కలెక్టర్ గారు సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ బాలుర వసతి గృహానికి అందజేశారు..తొలుత హాస్టల్ విద్యార్థులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హాస్టల్లోని పూర్వపు విద్యార్థులు వారి యొక్క అనుభవాలను విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. అనంతరం ఇద్దరు పూర్వపు విద్యార్థులను కలెక్టర్ సన్మానించారు. అదే విధంగా పూర్వ విద్యార్థి అయిన అనంతపురం రూరల్ సీఐ గారిని కలెక్టర్ సన్మానించారు.. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రంగ లక్ష్మి దేవి, వెల్దుర్తి జడ్పిటిసి సుంకన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు రెడ్డి పోగు భాస్కర్ మాదిగ ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నవీన్ మాదిగ వివిధ కుల సంఘాల నాయకులు,హాస్టల్ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయ సాధనకు పతి ఒక్కరు కృషి చేయాలి



● అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న టీడీపీ , వైకాపా పార్టీ నాయకులు

మంత్రాలయం, ఏప్రిల్ 14(మనం న్యూస్): అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మంత్రాలయం టిడిపి ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి ,జనసేన పార్టీ, ఐక్య ర వాల్మీకి పోరాట రాష్ట్ర అధ్యక్షులు ఇంచార్జ్ బి లక్ష్మన్న, వైకాపా మండల అధ్యక్షులు భీమ్ రెడ్డి , టిడిపి జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి అన్నారు. సోమవారం అంబేద్కర్ జయంతి వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా మంత్రాలయం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వేరువేరు సమయాలలో వచ్చి పూల మాలలు వేసి, నివాళులర్పించారు . వారు మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని అన్నారు. అంటరానితనం కుల వివక్షత పై పెరిగిన పోరాటం యోధుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కొనియాడారు . అనంతరం జై భీమ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు చిక్కం జానయ్య , జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న నాయకులకు శాలువా కప్పి , పూలమాలు వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భీమయ్య , ఉప సర్పంచ్ హోటల్ పరమేష్ , టీడీపీ మంత్రాలయం టౌన్ అధ్యక్షులు వరదరాజులు , బిసిసెల్ జనరల్ సెక్రటరీ వట్టెప్ప నరసింహులు , మీడియా కోఆర్డినేటర్ విజయరామిరెడ్డి , కోసిగి టీడీపీ నాయకులు పల్లెపాడు రామిరెడ్డి , ముత్తురెడ్డి , వెంకటపతి రాజ్ ,టిప్పు సుల్తాన్ , సురేష్ నాయుడు , జై భీమ ఎమ్మార్పీఎస్ నాయకులు రత్నం , యోహాన్ , తదితరులు ఉన్నారు.

## ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులు వేసిన వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

● సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూల్, ఏప్రిల్ 14 (మనం న్యూస్ ): ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులు వేసి బడుగు బలహీన వర్గాలకు చేసిన సేవలు మరువలేని అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు సోమవారం నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత భారతరత్న అవార్డు గ్రహీత దళితుల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి ఈ వేడుకలు కర్నూలు జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా తెలుగుదేశంపార్టీ ప్రదాన కార్యదర్శి ఆద్వర్యంలో జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయం నందు జయంతి వేడుకలను నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా డా.. బీ.ఆర్ అంబేద్కర్ గారి చిత్రపటానికి ముందుగా పూల మాల వేసి నివాళ్ళు అర్పించడం జరిగింది. కార్యక్రమానికి తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కర్నూలు నగర పార్టీ అధ్యక్షులు నాగారాజు యాదవ్, కె.ఇ.సత్య ముఖ్యులుగా హాజరు కావడమైనది. ఈ సందర్భంగా జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, రాష్ట్ర మాల కార్పోరేషన్ డైరెక్టర్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి పోతురాజు రవికుమార్, రాష్ట్ర మాదిగ కార్పోరేషన్ డైరెక్టర్, కర్నూలు జిల్లా ఎస్.సి సెల్ అధ్యక్షులు ధరూర్ జేమ్స్ కార్యక్రమానికి విచ్చేసిన పార్టీ నాయకులను, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డిపోగు బజారన్నా , రాష్ట్ర నాయిబ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ విజయ్ కుమార్ , కర్నూలు నియోజకవర్గం ఐటీడీపీ అధ్యక్షులు మందా అఖిల్ , కర్నూలు నియోజకవర్గం 164 బూత్ ఇన్చార్జి విష్ణు , టీఎన్ఎస్ఎఫ్ .నాయకులు జలీల్ బాషా , తెలుగుయువత ఉపాధ్యక్షులు పేరపోగు రాజు , నాయకులు . ధరూరు రాంప్రకాష్ , జోహారాపురం బూత్ ఇన్చార్జి .కర్నాకర్ , టిడిపి నాయకులు లక్ష్మీపురం నాయకులు మారెన్న , టిడిపి నాయకులు .చలపతి , బీసీ నాయకులు . కృష్ణోజీరావు , జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు . సత్రం రామక్రిష్ణ , జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పి,హనుమంత రావు చౌదరి , సురేంద్ర బీసీ నాయకులు రాంబాబు , కర్నూలు నియోజకవర్గానికి చెందిన . బెస్త వెంకటేశ్ ,కర్నూలు నియోజకవర్గం 15 వార్డ్, ఆర్. అంజి మరియు ఇతర టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొనటం జరిగింది.

## మోడల్ స్కూల్ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష 21 తేదీ న నిర్వహిస్తాం




● ప్రిన్సిపాల్ టీ. మర్యాదస్

బేతంచేర్ల, ఏప్రిల్ 14(మనంన్యూస్): గోరుమానకొండ తాండ సమీపంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ టీ, మరియదాస్ సమావేశంలో మాట్లాడుతూ ఆరో తరగతిలో ప్రవేశం కొరకు దరఖాస్తు చేసుకున్నటువంటి విద్యార్థులకు ప్రవేశ పరీక్ష తేదీని ఈస్టర్ పండగ సందర్భంగా 20వ తేదీ ఆదివారం నిర్వహించవలసిన పరీక్ష 21వ తేదీ సోమవారం కి రాష్ట్ర ప్రభుత్వం మార్చడం జరిగిందని కావున బేతంచేర్ల మండలంలోని గోరువమానుకొండ మోడల్ స్కూల్ కు ఆరవ తరగతిలో ప్రవేశం కొరకు దరఖాస్తు చేసుకున్నటువంటి విద్యార్థులు ఏప్రిల్ 20వ తేదీ అనగా ఆదివారం నాడు కాకుండా ఏప్రిల్ 21వ తేదీ సోమవారం నాడు ఉదయం10:00 గంటలనుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు జరిగే పరీక్షకు తమ తమ హాల్ టికెట్లతో హాజరు కాగలరని సంబంధిత హాల్ టికెట్లను వెబ్సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని తెలిపారు.

## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి

● డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

సి బెళగల్, ఏప్రిల్ 14(మనం న్యూస్): సిబెళగల్ మండల కేంద్రంలో సోమవారం నాడు అన్ని గ్రామ పంచాయతీలో వాడవాడలో ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి134 వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు సి.బెళగల్ మండలంలోని ఎస్సీ కాలం చెందిన యూత్ సభ్యులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని బులోరవాహంలో ఎక్కించుకొని యువకులు గ్రామంలోని పురవీధుల గుండా తిప్పుతూ అంబేద్కర్ కి జై అంటూ నినాదాలు చేస్తూ నృత్యాలు చేస్తూ కేరింతల కొడుతూ అంబేద్కర్ ని స్మరించుకుంటూ బస్టాండ్ ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి యూత్ సభ్యులు బి రత్నం సల్మాన్ ప్రకాష్ నాగరాజు పూలమాలలు వేసి ఆయనకు నివాళులు అర్పించారు అనంతరం యూత్ సభ్యులు రాసి పోగుల సల్మాన్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కేవలం ఒక జాతికి చెందిన వాడు కాదని ప్రతి జాతికి ఒక ఆదర్శమూర్తిని ఈరోజు ప్రతి వర్గము ప్రతి జాతి అభివృద్ధి పతంలో నడుస్తుంది అంటే కేవలం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పెట్టిన భిక్షా అని ఆయన అన్నారు ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఇతర వర్గాల వారు ఈరోజు స్వేచ్ఛగా ఉన్నామంటే అది డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కారణమని ఆయన తెలిపారు ప్రతి ఒక్కరు బాబాసాహెబ్ అంబేద్కర్ గురించి పూర్తిగా తెలుసుకోవాలని ఆయన సూచించారు అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చరిత్రను మరియు అతను ఎదుర్కొన్న అవమానాలను ఆయన ఆశీస్సు పూర్తి కోసము మనమంతా కలిసికట్టుగా ముందుకు సాగాలని అన్నారు అంబేద్కర్ కలలుగన్న సమాజం అండరాంతనం లేనిటువంటి కుల సమాజం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని సమాజంలో కులరహిత సమాజము ఆర్థిక అంతరాలు లీటినటువంటి సమాజము బడుగు బలహీన వర్గాల కోసం రాజ్యాధి కారము కోసమే ప్రతి ఒక్కరు పాటుపడి మన హక్కులను మనమే సాధించుకోవాలని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఎప్పుడైతే మన హక్కులను నిర్భయంగా అడిగి తెలుసుకోవాలని ఎప్పుడైతే సమాజంలో ప్రతి ఒక్కరూ సమస్యల పైన అవగాహన కలిగి ఉంటారు అప్పుడే అంబేద్కర్ గారికి మనం ఇచ్చేటువంటి ఘనమైన నివాళులని ఆయన అన్నారు ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆశయాలను అనుగుణంగా ముందుకు సాగిపోవాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఎస్సీ కాలనీ చెందిన యువకులు అందరూ పాల్గొన్నారు.



## ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్



● జై భీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు చిక్కం జానయ్య

మంత్రాలయం, ఏప్రిల్ 14(మనం న్యూస్): ప్రపంచ మేధావి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని జై భీమ్ రాష్ట్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు చిక్కం జానయ్య, ఎఐసిసి రాష్ట్ర కార్యదర్శి ఆల్ ఫ్రెడ్ రాజు అన్నారు. సోమవారం అంబేద్కర్ 134 వ జయంతి వేడుకలు పురస్కరించుకుని జైభీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జీ హనుమన్న ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కేవలం దళితులకు మాత్రమే కాదు యావత్ ప్రపంచానికే ఆయన మార్గదర్శి అని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఇతర వర్గాల వారు ఈ రోజు స్వేచ్ఛగా ఉన్నామంటే అది డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కారణం అని అన్నారు. ప్రతి ఒక్కరూ బాబాసాహెబ్ అంబేద్కర్ గురించి పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమన్న, ఏసేపు ,రత్నం, అనిల్, మారెప్ప, యోహాను,గోపినాథ్, దేవదాసు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళులు అర్పించిన విద్యార్థి యువజన సంఘాలు



కర్నూలు ఏప్రిల్ 14మనం న్యూస్: డాక్టర్ బి.ఆర్ . అంబేద్కర్ 135 జయంతి సందర్భంగా కర్నూలు నగరం లోని క్లస్టర్ యూనివర్సిటీ ప్రాంగణంలో అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళులు అర్పించిన విద్యార్థి యువజన సంఘాలు ఈ సందర్భంగా టి ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చంద్ర ప్ప, అంబేద్కర్ స్టూడెంట్ అసోసియేషన్ కన్వీనర్ రాఘవేంద్ర, భీమ్ ఆర్మీ కన్వీనర్ విజయభాస్కర్ లు మాట్లాడుతూ పౌరుని నైతికాభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి అని చాటిన మహామేధావి, బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అని అన్నారు . అంటరానితనం, అస్పృశ్యత నిర్మూలనకు, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన ధీశాలి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు. భారతదేశ ఔన్నత్యాన్ని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రపంచవ్యాప్తం చేసిన మహోన్నత కీర్తిశిఖరం, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, నేటి తరానికి ఆ మహనీయుని సేవలు స్ఫూర్తిదాయకం.భారత రాజ్యాంగ రూపశిల్పి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి 134వ జయంతి సందర్భంగా ఆ మహానుభావుని సేవలు స్మరిస్తూ ఘననివాళులు.ఈ కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా ట్రెజరర్ సురేష్,టి ఎస్ ఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేష్, నరసింహులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ కు ఘననివాళి



మహానంది, ఏప్రిల్14(మనంన్యూస్): భారత రాజ్యాంగ నిర్మాత భారత రత్న అవార్డు గ్రహీత దళితుల ఆశాజ్యోతి డాక్టర్ బి ఆర్ అంబేత్కర్ 134 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం మహానంది మండల పరిధిలోని పుట్టుపల్లి గ్రామంలో మహానంది దేవస్థానం మాజీ చైర్మన్ మహేశ్వర రెడ్డి, కందుల రఘురామి రెడ్డి, గోపవరం గ్రామంలో వైసిపి నాయకులు పుల్లయ్య యాదవ్, సిపిఐ నాయకులు మండల కార్యదర్శి సామేలు, సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, గురుమూర్తి, రాజేశ్వరయ్య, తదితరులతో పాటు గాజులపల్లి ఆర్ ఎస్ గ్రామాలలో దళిత సంఘాల నాయకులు సుధాకర్,అంబేత్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పలువురికి పంచిపెట్టారు.

## అణగారిన కులాల ఆశా జ్యోతి డా.బి ఆర్.అంబేద్కర్

కర్నూలు, ఏప్రిల్ 14 (మనం న్యూస్): అణగారిన కులాల ఆశా జ్యోతి డా.బి ఆర్.అంబేద్కర్ అని ప్రజా చైతన్య పార్టీ అధ్యక్ష కార్యదర్శులు శివశంకర్,క్రాంతి కుమార్ అన్నారు.కర్నూలు నగరంలోని ధర్మ పేట సర్కిల్ లో ప్రజాచైతన్య పార్టీ ఆధ్వర్యంలో డా. బిఆర్ . అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ మహనీయుడి జీవిత చరిత్రను మరియు అతను ఎదుర్కొన్న అవమానాలను వివరించారు. ఆయన ఆశయాల స్ఫూర్తి కోసం మనమంతా కలిసికట్టుగా ముందుకు సాగాలని అన్నారు. అంబేద్కర్ కలలుగన్న సమాజం అంటరానితనం లేనటువంటి సమాజం కుల రహిత సమాజం ఆర్థిక



అంతరాలు లేనటువంటి సమాజం బడుగు బలహీన వర్గాల రాజ్యాధికారం అనే లక్ష్యాలను సాధించేందుకు ప్రతి ఒక్కరు అంబేద్కర్ బాట నడవాలని అన్నారు.ఆయన ఆదర్శాలకు అనుగుణంగా ముందుకు సాగాలని అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని నిర్మించి దేశానికి దిశా నిర్దేశాన్ని చూపినటువంటి మహా నాయకుడిని ఇంకా ఒక జాతికి ఒక కులానికి అంటగడుతూ మాట్లాడడం బాధాకరమని అన్నారు. ఆయన మన భారతజాతికి మార్గదర్శకుడని మహోన్నతమైన వ్యక్తి అని రాజ్యాంగ రచనలు భాగంగా ముసాయిదా కమిటీని ఏర్పాటు చేస్తే ఆ కమిటీలో సభ్యులుగా ఉన్న అగ్రవర్ణాలు ఎవరు సహకరించకపోయిన కఠోర దీక్షతో భారత రాజ్యాంగాన్ని పూర్తి చేసి భారత జాతికి అంకితం చేసిన మహా నాయకుడు అని గుర్తించాలని అన్నారు. ఆయన ఒక కులానికో ఒక జాతికో నాయకుడు కాదని యావత్ భారతదేశానికి మహా నాయకుడు అని అన్నారు. ఆయనను ప్రపంచ దేశాలు అన్ని మహా మేధావిగా గుర్తించి ఇంగ్లాండు లండన్ క్రీం బిడ్జి లాంటి పెద్ద పెద్ద విశ్వవిద్యాలయాల్లో ఆయన విగ్రహాలను ఏర్పాటు చేసి గౌరవిస్తూ ఉంటే మన భారత దేశంలో ఇంకా ఆయనను ఒక జాతికి ఒక కులానికి అంటగట్టడం బాధాకరమని ఆయనను మన భారత జాతిలో మహా నాయకుడిగా గుర్తించాలని ఆయన ఆశయాలకు అనుగుణంగా మనం ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా చైతన్య యువజన సంఘం నాయకులు సాగర్,కృష్ణ,మద్దిలేటి,పిసిపి గౌరవ సలహాదారులు బోయ చిన్నయ్య,ప్రకాష్ రావు,కాంగ్రెస్ నాయకులు బాలస్వామి, కమిటీ సభ్యు లు షరీన్ నగర్ సుబ్బయ్య, సోమన్న ,పెద్దయ్య, వెంకటరమణ, మునెయ్య,జయరాజు,ఎంఆర్పీస్ నాయకులు బాలసుందరం, తదితరులు పాల్గొన్నారు.




# నా ఇన్నింగ్స్‌కు విలువే లేదు : కరుణ్ నాయర్

కరుణ్ నాయర్ ఐపీఎల్ పునరాగమనం ఘనంగా జరిగింది. బ్యాటింగ్ పరంగా అద్భుతంగా ఆడాడు. అయితే, తాను ప్రాతినిధ్యం వహించిన ఢిల్లీ క్యాపిటల్స్ కు ఓటమి ఎదురుకావడం నిరాశపరిచిందని కరుణ్ వ్యాఖ్యానించాడు. ఐపీఎల్ 2025 సీజన్ లో ముంబయితో జరిగిన మ్యాచ్ లో ఢిల్లీ 12 పరుగుల తేడాతో ఓడిపోయింది. వన్ డౌన్ లో వచ్చిన కరుణ్ నాయర్ 40 బంతుల్లో 89 పరుగులు చేశాడు. అయితే, ఆఖర్లో వరుసగా మూడు రనౌట్లు కావడంతో ఢిల్లీ పరాజయం చవిచూసింది. తన ప్రదర్శనపై విలేకర్లు అడిగిన ప్రశ్నకు కరుణ్ నాయర్ సూపర్ సమాధానం ఇచ్చాడు. ''నా ఇన్నింగ్స్ పై మాట్లాడటానికి ఏమీ లేదు. ఇప్పుడు పెద్ద ప్రయోజనమూ లేదు. మంచి ఆటతీరే ప్రదర్శించా. కానీ, నా టీమ్ ఓడిపోయింది. కాబట్టి, ఆ ఇన్నింగ్స్ కు విలువే లేదు. విజయం సాధించనప్పుడు ఎంత గొప్ప ఇన్నింగ్స్ అయినా వాల్యూ ఉండదు. ఈ సీజన్కు ముందు నేను ఐపీఎల్ లో ఆడతాననే నమ్మకంతోనే ఉన్నా. ఎప్పుడు అవకాశం వచ్చినా నిరూపించుకొనేందుకు సిద్ధంగానే ఉన్నా. మనసులో మాత్రం క్రీజ్ లోకి వెళ్లాక అత్యుత్తమ ఆటతీరు ప్రదర్శించాలని భావించా. ఇన్నింగ్స్ ను వేగవంతం చేయడానికి కొన్ని బంతులు తీసుకున్నా. పవర్ ప్లేలో దూకుడుగా ఆడాల్సి ఉంటుంది. నేను మామూలుగా ఆడే షాట్లనే కొట్టా. నాకు అన్నీ కలిసొచ్చాయి. నా బ్యాటింగ్ పరంగా సంతోషంగానే ఉన్నా. మా జట్టు విజయం సాధించి ఉంటే ఇంకా బాగుండేది'' అని కరుణ్ వెల్లడించాడు.

**ఫాఫ్ లేని లోటు..**

''పవర్ ప్లేలో ఫాఫ్ డుప్లెసిస్ డేంజరస్ బ్యాటర్. అతడు లేని లోటును పూరించాల్సిన బాధ్యత నాది. బెంచ్ ఉన్న ఆటగాళ్లంతా తమ అవకాశం కోసం ఎదురుచూస్తూ ఉన్నారని తెలుసు. అందుకే మెంటల్లీ నేను కూడా నా ఛాన్స్ కోసం సిద్ధంగానే ఉన్నా. తుది జట్టు ఎంపిక ఎప్పుడూ కఠినమే. ఆ విషయంలో మేనేజ్ మెంట్ ఏం నిర్ణయం తీసుకున్నా గౌరవిస్తా. నా సన్నద్ధతను ఎప్పుడూ కొనసాగిస్తూనే ఉంటా. అవకాశం వచ్చినప్పుడు అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తా'' అని వెల్లడించాడు.



# పార్క్ హయత్ హోటల్‌లో అగ్నిప్రమాదం.. సన్‌రైజర్స్ టీమ్‌కు తప్పిన ముప్పు

హైదరాబాద్ లోని పార్క్ హయత్ హోటల్ లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుకుంది. హోటల్ మొదటి అంతస్తులో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో సిబ్బంది, అతిథులు భయాందోళనకు గురయ్యారు. అయితే ఇదే హోటల్లో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు బస చేస్తోంది. ఈ ప్రమాద సమయంలో ఎస్ఆర్హెచ్ టీమ్ సభ్యులు హోటల్ లోనే ఉన్నారు. ప్రమాద విషయం తెలిసి ప్లేయర్లు, సపోర్టింగ్ స్టాఫ్ అక్కడి నుంచి ప్రత్యేక బస్సులో వెళ్లిపోయారు. ఇక సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హోటల్ కు చేరుకుని పొగలను అదుపు చేశారు. మొదటి అంతస్తులో విద్యుత్ వైర్లు కాలడంతోనే ప్రమాదం సంభవించినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా సన్రైజర్స్ హైదరాబాద్ తమ తదుపరి మ్యాచ్లో ఏప్రిల్ 17న వాంఖడే స్టేడియం వేదికగా ముంబై ఇండియన్స్ తలపడనుంది. ఈ మ్యాచ్ కోసం సన్రైజర్స్ టీమ్ సోమవారం సాయంత్రం ముంబైకి బయలు దేరాల్సి ఉంది. కానీ అంతలోనే ఈ ప్రమాదం చోటు చేసుకోవడంతో కాస్త వ ఖ ం ద ు గా నే ఎస్ఆర్హెచ్ టీమ్ చెక్ అవుట్ చేసింది. ఈ ఏడాది సీజన్లో సన్రైజర్స్ టీమ్ కాస్త తడబడుతోంది. ఇప్పటివరకు ఆడిన 6 మ్యాచ్లో రెండు విజయాలు మాత్రమే సాధించింది. అయితే ఆఖరి మ్యాచ్లో పంజాబ్ కింగ్స్పై మాత్రం రికార్డు విజయాన్ని ఎస్ఆర్హెచ్ అందుకుంది. 245 పరుగుల లక్ష్యాన్ని మరో 9 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. ఈ మ్యాచ్లో యువ ఓపెనర్ అభిషేక్ శర్మ(141) భారీ సెంచరీతో చెలరేగాడు.

# చెన్నై వరుస పరాజయాలకు బ్రేక్.. లఖ్‌నవూపై విజయం



చెన్నై సూపర్ కింగ్స్ వరుస పరాజయాలకు బ్రేక్ పడింది. లఖ్ నవూ సూపర్ జెయింట్స్ జరిగిన మ్యాచ్ లో ధోనీ సేన 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత లఖ్ నవూ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. కెప్టెన్ రిషబ్ పంత్ (63) అర్ధశతకంతో అలరించాడు. అనంతరం బ్యాటింగ్కు దిగిన చెన్నై 19.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఆ జట్టులో శివమ్ దూబె (43*), రచిన్ రవీంద్ర (37), షేక్ రషీద్ (27), ధోనీ (26*) రాణించారు. లఖ్నవూ బౌలర్లలో రవి బిష్ణోయ్ 2, అవేశ్ ఖాన్, మార్క్రమ్, దిగ్వేశ్ ఒక్కో వికెట్ తీశారు.

తొలుత బ్యాటింగ్ చేసిన లఖ్ నవూ తొలి ఓవర్లోనే షాక్ తగిలింది. ఖలీల్ బౌలింగ్ లో చివరి బంతికి మార్క్రమ్ (6) క్యాచ్ ఔటయ్యాడు. నాలుగో ఓవర్లో హిట్టర్ పూరన్ (8) అన్షుల్ కంబోజ్కు వికెట్ల ముందు దొరికిపోయాడు. ఈ దశలో మరో ఓపెనర్ మిచెల్ మార్ష్ (30: 25 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సు)తో జట్టు కట్టిన రిషబ్ పంత్ (63: 49 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సు) ఇన్నింగ్సు ముందుకు నడిపించాడు. ఖలీల్ వేసిన ఐదో ఓవర్లో మార్ష్ వరుసగా ఫోర్, సిక్స్ బాదడంతో లఖ్నవూ ఇన్నింగ్స్కు కాస్త ఊపు వచ్చింది. మరో వికెట్ పడకుండా వీరు జాగ్రత్తగా ఆడారు. అయితే పదో ఓవర్లలో 73 పరుగుల వద్ద ఈ జోడీని జడేజా విడదీశాడు. మిచెల్ మార్ష్ బౌల్ అయ్యాడు. ఆ తర్వాత వచ్చిన ఆయుష్ బదోనీ (22: 17 బంతుల్లో 1 ఫోర్లు, 2 సిక్సు), అబ్దుల్ సమద్ (20: 11 బంతుల్లో 2 సిక్సు)తో కలిసి రిషబ్ విలువైన ఇన్నింగ్సు నిర్మించాడు. 15 ఓవర్లకు ఆ జట్టు 109/4 నిలిచిన లఖ్నవూ.. చివరి ఐదు ఓవర్లలో 57 పరుగులు చేసింది. చెన్నై బౌలర్లలో రవీంద్ర జడేజా 2, పతిరన 2, ఖలీల్ అహ్మద్, అన్షుల్ చెరో వికెట్ తీశారు.



ఐపీఎల్-2025లో ఆదివారం అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ముంబై ఇండియన్స్తో జరిగిన మ్యాచ్లో 12 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్ ఓటమి పాలైన సంగతి తెలిసిందే. అయితే ఓటమి బాధలో ఉన్న ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్కు భారీ షాక్ తగిలింది. అక్షర్కు ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ భారీ జరిమానా



# అక్షర్ పటేల్‌కు
## రూ.12 లక్షల జరిమానా

విధించింది. ముంబైతో జరిగిన మ్యాచ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు నిర్ణీ సమయంలో పూర్తి ఓవర్ల కోటా పూర్తి చేయడంలో విఫలమైంది. ఈ సీజన్లో తొలిసారి ఢిల్లీ స్లో ఓవర్ రేట్ నమోదు చేయడంతో... ఐపీఎల్ నియమావళి ప్రకారం ఆ జట్టు కెప్టెన్ అయిన అక్షర్ పటేల్ రూ. 12 లక్షలు జరిమానా విధించారు.

'ఢిల్లీ క్యాపిటల్స్ సారథి అక్షర్ పటేల్కు జరిమనా విధించాం. అరుణ్ జైట్లీ స్టేడియంలో ముంబై ఇండియన్స్తో జరిగిన మ్యాచ్లో స్లో ఓవర్ రేట్ను కొనసాగించినందుకు ఈ నిర్ణయం తీసుకున్నాము. ఆర్టికల్ 2.22 ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం అక్షర్ కు రూ. 12 లక్షలు జరిమానా విధించాం'' అని ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఐపీఎల్ 2025 సీజన్లో 'స్లో ఓవర్ రేట్' కారణంగా జరిమానా ఎదుర్కొన్న ఆరో కెప్టెన్ అక్షర్ పటేల్ కావడం గమనార్హం. ఈ జాబితాలో సంజూ శాంసన్, రియాన్ పరాగ్, హార్దిక్ పాండ్యా, రిషబ్ పంత్, రజత్ పాటిదార్ ఉన్నారు.

కాగా ఈ మ్యాచ్లో మొదట బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగుల భారీ స్కోర్ చేసింది. ముంబై బ్యాటర్లలో తిలక్ వర్మ(59) టాప్ స్కోరర్గా నిలవగా.. ర్యాన్ రికెల్టన్(41), సూర్యకుమార్(40), నమాన్ ధీర్(38) పరుగులతో రాణించారు. ఢిల్లీ బౌలర్లలో కుల్దీప్ యాదవ్, విప్రజ్ నిగమ్ రెండు వికెట్లు పడగొట్టగా.. ముఖేష్ కుమార్ ఓ వికెట్ సాధించారు. అనంతరం 206 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 19 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. ఢిల్లీ 19 ఓవర్లో వరుసగా మూడు రనౌట్లు అయి మ్యాచ్ను చేజార్చుకుంది.

# గొప్ప మనసు చాటుకున్న తాప్సీ !

గ్లామర్ బ్యూటీ తాప్సీ చాలా బోల్ గా ఉంటుంది. ఉన్నది ఉన్నట్టు మాట్లాడుతుంది. తాజాగా హీరోయిన్ తాప్సీ గొప్ప మనసు చాటుకున్నారు. వేసవి కాలం కావడంతో ఎండలకు అల్లాడిపోతున్న పేదలకు ఫ్యాన్లు, కూలర్లు ఉచితంగా ఇవ్వడం ఇప్పుడు హాట్ టాపిక్



గా మారింది. తన భర్త మథియాస్ బోతో కలిసి తాప్సీ పేదల ఇళ్లకు వెళ్లి మరీ వాటిని పంచారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో ప్రస్తుతం వైరల్ అవుతుంది. ఈ వీడియో చూసిన నెటిజన్లు తాప్సీపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. తాప్సీ గ్రేట్ అంటూ నెటిజన్లు ఆమెను పొగుడుతున్నారు. ఝుమ్మంది నాదం సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన తాప్సీ. ఆ తర్వాత బాలీవుడ్ కి వెళ్లి అక్కడ కూడా తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. గ్లామర్ విషయంలో కానీ.. ఫిట్ నెస్ విషయంలో కానీ 'తాప్సీ పన్ను' ఏ స్టార్ హీరోయిన్ కి తక్కువ కాదు. అందుకే, ఇండస్ట్రీలో తాప్సీ పన్నుకి ఆఫర్లు రోజురోజుకు పెరుగుతున్నాయి.



# ప్రభాస్
## ఈ కాస్ట్లీ కటౌట్ కోసం అభిమానులు వెయిటింగ్..!

ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో కాస్ట్ లీ కటౌట్ ఎవరిదంటే అందరూ చెప్పే మాట అగ్ర కథానాయకుడు ప్రభాస్. ఎందుకంటే వరుస పాన్ ఇండియా సినిమాలు చేస్తున్న 'డార్లింగ్' డేట్స్ కోసం చాలా మంది దర్శక-నిర్మాతలు వేచి చూస్తున్నారు. ఇప్పటికే ఆయన ఒప్పుకొన్న ప్రాజెక్టుల విలువ వందల కోట్లు. ప్రభాస్ మూవీ కోసం వేచి చూస్తున్న అభిమానులకు మాత్రం ఒకింత నిరాశే ఎదురవుతోంది. కారణం క్రేజీ సినిమాలన్నీ ఆలస్యమవుతున్నాయి. గత డిసెంబరులో ప్రభాస్ కాలికి స్వల్ప గాయమైన సంగతి తెలిసిందే. వైద్యుల సూచన మేరకు కొన్నిరోజులు విశ్రాంతి తీసుకున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాలో కొంత షెడ్యూల్ పూర్తి చేసి, కాలి గాయం చికిత్స నిమిత్తం ఇటలీ వెళ్లినట్లు సినీ వర్గాలు తెలిపాయి. గాయం పూర్తిగా నయం కావడానికి ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఈ వేసవి కానుకగా విడుదల కావాల్సిన 'ది రాజాసాబ్' ప్రస్తుతానికి వాయిదా పడిన సంగతి తెలిసిందే. మారుతీ దర్శకత్వంలో హారర్ థ్రిల్లర్ గా ఇది రూపొందుతోంది. ప్రభాస్ కు సంబంధించి కొన్ని సన్నివేశాల చిత్రీకరణ అలాగే ఉండిపోయింది. దీనికితోడు వీఎఫ్ఎక్స్ పనులు మరింత ఆలస్యమవుతున్నాయి. దీంతో దర్శకుడు మారుతి కొన్ని సన్నివేశాలకు మెరుగులు దిద్దే పనిలో ఉన్నారు. అయితే, ప్రభాస్ వస్తేగానీ, ఈ సినిమా ఒక కొలిక్కి రాదు. ఇక హనురాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడిక్ డ్రామా కూడా ప్రభాస్ కోసం వేచి చూస్తోంది. ఆయన నేపథ్యంలో వచ్చే కీలకమైన యాక్షన్ సన్నివేశాలను షూట్ చేయాల్సి ఉంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసుకుని 'డార్లింగ్' రాక కోసం చిత్ర బృందం వేచి చూస్తోంది.

ఈ రెండు చిత్రాలతో పోలిస్తే, 'స్పిరిట్' పరిస్థితి ఇంకా కాస్త ఇబ్బందికరంగా ఉంది. దర్శకుడు సందీప్రెడ్డి వంగా ఇప్పటికే స్క్రిప్ట్ లాక్ చేసుకుని, కూర్చొన్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగి ఉంటే, ఈపాటికే చిత్రీకరణ మొదలు పెట్టాల్సి ఉంది. అయితే, సందీప్ డిమాండ్ వేరే ఉంది. ప్రభాస్ కు సంబంధించి ఆయన ఒకేసారి డేట్స్, అది కూడా ఎక్కువగా ఇవ్వమని అడుగుతున్నారట. దీంతో ఈ ప్రాజెక్ట్ అంతకంతకూ ఆలస్యమవుతోంది. ప్రస్తుతం సందీప్ లొకేషన్ లపై దృష్టి పెట్టారు. ఇందులో మలయాళీ నటుడు మమ్ముట్టి కీలక పాత్ర పోషిస్తారని టాక్ వినిపిస్తోంది. ఇది ఎంతవరకూ నిజమో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

'రాజాసాబ్' ఓ కొలిక్కి వస్తేగానీ ప్రభాస్ ఈ మూవీ కోసం అందుబాటులోకి వచ్చే అవకాశం లేదు. ఈ మూడు పూర్తయితే 'కల్కి2' కోసం ప్రభాస్ రంగంలోకి దిగాల్సి ఉంది. ఈ ఏడాది చివరి నాటికి మూవీని పట్టాలెక్కించాలని దర్శకుడు నాగ్ అశ్విన్ భావిస్తున్నారు. మరోవైపు ఎన్టీఆర్ తో సినిమా పూర్తి చేసుకుని ప్రశాంత్ నీల్ రెడీ ఉంటారు. 'సలార్2: శౌర్యంగ పర్వం' షురూ చేస్తారు. వీటన్నింటి మధ్యలో ప్రభాస్ కీలక పాత్రలో ప్రశాంత్ వర్మ ఓ సినిమా తీసే అవకాశం ఉంది. అదే 'బ్రహ్మ రాక్షస్'. హోంబాలే ఫిలమ్స్ దీన్ని నిర్మించనుంది. ఇప్పటికే ప్రభాస్ కు సంబంధించిన లుక్ టెస్ట్ జరిగిందట. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇదీ ప్రభాస్ సినిమాల లైనప్.. వాటి లేటెస్ట్ అప్డేట్..!




# ఎన్టీఆర్ 'డ్రాగన్'లో ఓ స్పెషల్ రోల్?

ప్రశాంత్ నీల్ - ఎన్టీఆర్ కలయికలో రాబోతున్న సినిమా పై రోజుకొక రూమర్ వినిపిస్తోంది. ఐతే, తాజాగా ఈ సినిమా గురించి వినిపిస్తున్న అప్ డేట్ ప్రకారం ఈ సినిమాలో ఓ స్పెషల్ రోల్ ను డిజైన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రోల్ కోసం ఓ బాలీవుడ్ స్టార్ హీరోని ఎంపిక చేయాలని ప్రశాంత్ నీల్ ప్లాన్ చేస్తున్నాడట. ఆ హీరో బాలీవుడ్ హీరో రణ్ వీర్ సింగ్ అని టాక్ నడుస్తోంది. ఓ పోలీస్ పాత్రలో రణ్ వీర్ సింగ్ కనిపించబోతున్నాడని తెలుస్తోంది. మరి ఈ వార్తలో ఎంతవరకు నిజం ఉందో చూడాలి.

ఇక ఈ మూవీ టైటిల్ 'డ్రాగన్' అని ప్రచారంలో ఉంది. ఐతే, 'డ్రాగన్' సినిమాని ఎన్టీఆర్ కెరీర్ లోనే అత్యుత్తమ సినిమాల్లో ఒకటిగా చేయాలని ప్రశాంత్ నీల్ ప్రయత్నం చేస్తున్నాడట. అందుకే, ఈ సినిమా స్క్రిప్ట్ కోసం ప్రశాంత్ నీల్ చాలా టైమ్ తీసుకున్నాడు. కాబట్టి, ఇప్పటి వరకూ ప్రశాంత్ నీల్ తీసిన అన్ని సినిమాల్లోకల్లా బెస్ట్ సినిమా ఇదే అవుతుందని అంచనాలు ఉన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆరట్స్ కలిసి ఈ సినిమాని నిర్మిస్తున్నాయి. ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.

# AI తో అదరగొట్టేసిన 'మాస్ జాతర' ఎనర్జిటిక్ ఫస్ట్ సింగిల్..!



మన టాలీవుడ్ మోస్ట్ ఎనర్జిటిక్ స్టార్ హీరో రవితేజ హీరోగా అంతే ఎనర్జిటిక్ యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్ గా యువ దర్శకుడు భాను భోగవరపు తెరకెక్కిస్తున్న అవైటెడ్ సినిమానే మాస్ జాతర. రవితేజకి కలిసొచ్చిన మాస్ ఎంటర్టైనర్ జానర్లో తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ఆల్రెడీ మంచి హైప్ ఉంది.

ఇక దీనికి తగ్గట్టుగా ఇపుడు వదిలిన ఫస్ట్ సింగిల్ కూడా విన్న వెంటనే సూపర్ హిట్ అని చెప్పడంలో డౌట్ లేదు. సంగీత దర్శకుడు భీమ్స్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ తో మ్యాజిక్ చేసాడని చెప్పాలి. దివంగత సంగీత దర్శకుడు చక్రి మ్యూజిక్ కానీ తన వాయిస్ గాని ఎంత స్పెషల్ అని అందరికీ తెలిసిందే. మరి తన వాయిస్ తో ట్రై చేసిన ఈ ఫస్ట్ సింగిల్ అదిరిపోయింది అని చెప్పాలి. వీటితో పాటుగా రవితేజ ఎనర్జీ ఇందులో బిగ్గెస్ట్ హైలైట్. మధ్యలో ఇడియట్ ట్యూన్ కి రవితేజ అలా స్టెప్పేస్తుంటే మళ్ళీ పాత రోజుల్లోకి వెళ్లినట్టు అనిపిస్తుంది. దీనితో పాటుగా శ్రీలీల కూడా మరోసారి రవితేజతో అంతే ఎనర్జిటిక్ గా కనిపిస్తుంది. మొత్తానికి మాత్రం ఈ సాంగ్ తో మేకర్స్ ఫస్ట్ చార్ట్ బస్టర్ ని కొట్టేశారని చెప్పవచ్చు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.